కేజీహెచ్‌లో 'సుభోజనం' సేవల విస్తరణ



భవనం లోపల భోజనాలకు చేసిన ఏర్పాట్లు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కేజీహెచ్‌లో 11 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన 'సుభోజనం' సేవలను ప్రస్తుతం విస్తరిస్తున్నారు. కేజీహెచ్‌కు వచ్చే రోగుల సహాయకులకు హరేకృష్ణ మూవ్‌మెంట్, టచ్‌స్టోన్ ఛారిటీస్ సంయుక్తంగా రూ.10లకే రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నాయి. ఇంతకాలం భోజనం చేసే వారికి ఎటువంటి వసతులు లేవు. ఎండైనా, వానైనా ఆరుబయటే భోజనాలు చేసేవారు. ఇక నుంచి ఆయా ఇబ్బందులు తొలగనున్నాయి. ఎముకుల వార్డు సమీపంలోని కేజీహెచ్ సమకూర్చిన స్థలంలో హరేకృష్ణ సంస్థ భవనాన్ని నిర్మించింది. ఒకేసారి 150 మంది భోజనం చేసే విధంగా ఆ భవనంలో వసతులు కల్పించింది. చేతులు కడుక్కోవడానికి, తాగునీటి కోసం వేర్వేరుగా వసతి కల్పించారు. ఈనెల 7న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, కమిషనర్ సంపత్‌కుమార్, జేసీ మయూర్ అశోక్ భవనాన్ని ప్రారంభించనున్నారు.

కస్టమ్స్ అధికారిపై సి.బి.ఐ. కేసు నమోదు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: కాకినాడ పోర్టులో కస్టమ్స్ హౌస్ సూపరింటెండెంట్ వై.శ్రీనివాసులు ఒక కార్గో సర్వీస్ నుంచి రూ.3,18,200 లంచం తీసుకుంటుండగా సీబీఐ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. శ్రీనివాసులతో పాటు అతని ప్రతినిధి భరత్‌కుమార్‌పైన కూడా కేసు నమోదు చేసి ఆదివారం విశాఖ కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు సంబంధించిన ఇళ్లలోనూ, కార్యాలయాల్లోనూ సోదాలు జరిపి సుమారు రూ.27 లక్షలను స్వాధీనం చేసుకున్నారు.

అమ్మకు అర్చన.. అపూర్వ అలంకరణ

న్యూస్‌టుడే, తగరపువలస, ఎండాడ, అక్కిరెడ్డిపాలెం, అగనంపూడి

దసరా ఉత్సవాల సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లోని ఆలయాల్లో ఆదివారం అమ్మవారిని కనుల పండువగా అలంకరించారు. భక్తులను ఎంతగానో ఆకట్టుకున్న కొన్ని చిత్రాలు ఇక్కడ చూడొచ్చు.

తులసి దళాలతో..



ధైర్యలక్ష్మిగా కనకమహాలక్ష్మి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాతనగరం బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారు ఆదివారం ధైర్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నగరానికి చెందిన వి.వేణుగోపాల్, రేవతి దంపతులు అమ్మవారి అలంకరణ కోసం సమకూర్చిన రూ.30 వేలతో తులసి దళార్చన నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ ఈఓ శోభారాణి, ఏఈఓ తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకులు తిరుపతిరావు, పద్మజ పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, వన్‌టౌన్

కూరగాయలతో..



భీమిలి మండలం చిప్పాడలో..

నిమ్మకాయలతో..



ఎండాడ బీసీ కాలనీలో..

గాజులతో..



తుంగ్లాంలో..

పసుపు కొమ్ములతో..



అగనంపూడిలో..

నీళ్లకు నిలకడ మంత్రం

- జలసిరిని ఒడిసిపడితేనే ఫలితం
- నీటి సంక్షోభం నుంచి నగరానికి విముక్తి
- ఏపీఫెర్వాస్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల నిర్మాణం

ఈనాడు, విశాఖపట్నం

వేసవి వస్తే...కొన్ని ప్రాంతాల్లో తాగునీరు అందక ఇబ్బందులు. వర్షా కాలంలో కాలువలు, గెడ్డల ద్వారా సముద్రంలో వృథాగా కలిసే వాన నీరు. - ఏటా విశాఖలోని కొన్ని కాలనీల్లో కనిపించే దృశ్యాలివే.

దీనికి కాలనీల స్థాయి నుంచే పరిష్కారం వెతకాలని ఆంధ్రప్రదేశ్ కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్య(ఏపీఫెర్వాస్) ఆధ్వర్యంలో ప్రచారం చేస్తున్నారు. ఇంకుడు గుంతలు తవ్వించి జల సంరక్షణకు కృషి చేస్తున్నారు. వారిని ఆదర్శంగా తీసుకుంటే భవిష్యత్తులో నీటి కొరతను కొంతైనా అధిగమించొచ్చు.



శ్రీనూకాంబిక కాలనీలో ఇంకుడు గుంత

విశ్రాంత ఉద్యోగులే అధికం.. : నగరంలోని జేఆర్ నగర్ కాలనీ నివాసితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పదేళ్ల క్రితం 15 ఇంకుడు గుంతలు తవ్వారు. ప్రతి అపార్ట్‌మెంట్, ఇల్లు, పార్కు, ఖాళీ స్థలాల్లో సరైన స్థలం ఎంపిక చేసుకుని వీటిని నిర్మించారు. ఫలితంగా ఏడాదికి సుమారు 7,45,000 లీటర్ల నీటిని ఆదా చేస్తున్నట్లు వారు చెబుతున్నారు. విశాఖ కేంద్రంగా పనిచేస్తున్న ఏపీఫెర్వాస్‌లో అధిక శాతం విశ్రాంత ఉద్యోగులే. సమాఖ్య అధ్యక్షుడు ఉదయ్, సహాయ అధ్యక్షుడు కేఎస్ఆర్ మూర్తి, సంయుక్త కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో 150 కాలనీల్లో ఇంకుడు గుంతల ఏర్పాటుకు సంకల్పించారు. తొలి విడతగా సింహాచలం, కూర్మన్నపాలెం, కిర్లంపూడి, ఎంవీపీ, మధురవాడ, తిరుమలనగర్, అడవివరం, మర్రిపాలెం, వుడా లేఅవుట్ తదితర ప్రాంతాల్లో 60కి పైగా గుంతలు తవ్వారు.

రోజుకు మనిషికి అవసరమైన నీరు: 135 లీటర్లు

జీవీఎంసీ పరిధిలో సరఫరా: 95 లీటర్లు

120 మిలియన్ గ్యాలన్లు (ఎంజీడీ) తాగునీరు, పరిశ్రమలకు అవసరం

ప్రస్తుతం సరఫరా: 85 (ఎంజీడీ)



జేఆర్ నగర్ కాలనీలో..

జీవీఎంసీ సహకరిస్తే..

ప్రతి ఇంట్లోనూ పూర్తిస్థాయిలో ఇంకుడు గుంతలుండాలి. దాతల సహకారం అందిస్తామని చెప్పినా పలు కాలనీల్లో ముందుకు రాలేదు. జీవీఎంసీ సహకారం అందిస్తే పార్కులు, ఖాళీ స్థలాల్లో గుంతల నిర్మాణానికి సలహాలు, సూచనలు అందిస్తాం.

– కేఎస్ఆర్ మూర్తి, సహాయ అధ్యక్షుడు, ఏపీ ఫెర్వాస్

జీవీఎంసీ పరిధిలో కాలనీలు: 20,000 (సుమారు)

ఇంకుడు గుంతలున్నవి: 30%

150 ఏపీఫెర్వాస్‌లో నమోదు

గుంతలు ఏర్పాటుచేసిన కాలనీలు: 40


జీవీఎంసీ పరిధిలో జనాభా: 24 లక్షలు (సుమారు)

2051 నాటికి జనాభా (అంచనా): 50 లక్షలు (సుమారు)

రోజుకు తాగునీటి అవసరాలు: 180 ఎంజీడీ

దేశంలో 2030 నాటికి 40 శాతం ప్రజలకు తాగునీరు అందదని నీతి ఆయోగ్ పేర్కొంది. వర్షాభావ పరిస్థితులతో జిల్లాలో మూడేళ్లకోసారి నీటి కొరత తీవ్రమవుతోంది. ఏటా వేసవిలో జీవీఎంసీ ట్యాంకర్లతో నీటి సరఫరాకు రూ.4 నుంచి రూ.5 కోట్ల వరకు ఖర్చు చేస్తోంది. ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణానికి రూ.12 వేలు ఖర్చవుతుంది. విశాఖలో ఏడాదికి సాధారణంగా 1000 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుంది. ఇంకుడు గుంతలు నిర్మించి వర్షపు నీటిని ఒడిసిపడితే భూగర్భ జలాలు పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.

ఒక్కో నిర్మాణానికి రూ.12 వేలు



దారిలో.. ఊహించని రీతిలో!

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : జాతీయ రహదారిపై అగనంపూడి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంపై దువ్వాడ పోలీసుల వివరాలివి. జగదాంబ ప్రాంతానికి చెందిన ఐఎం.రావు మరో ఇద్దరు కుటుంబ సభ్యులు కారులో కొవ్వూరు వెళ్తున్నారు. అగనంపూడి సమీప డొంకాడ కాలనీ వద్దకు చేరుకునే సరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. కారు అదుపుతప్పి విభాగినిపైకి దూసుకెళ్లి, విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. కారులో ఉన్న జామి అనురాధ ఎడమ కాలికి తీవ్ర గాయమైంది. కారు మొత్తం నుజ్జునుజ్జయింది. అనురాధ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో నుజ్జయిన కారు

900 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

న్యూస్‌టుడే, విశాలాక్షినగర్

ఆరిలోవ కాలనీ చివరి బస్టాపు వద్ద 900 కిలోల రేషన్ బియ్యాన్ని ఆరిలోవ పోలీసులు పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఆరిలోవ శాంతిభద్రతల ఎస్సై కృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆరిలోవ కాలనీ ఎస్‌కే ఎంఎల్ నగర్‌లో నివాసముంటున్న వరద ప్రశాంత్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా 36 బస్తాల్లో రేషన్ బియ్యం నిల్వ చేశారు. వాటిని టాటా ఏస్‌లో శనివారం అర్ధరాత్రి తరలిస్తున్నారన్న సమాచారంతో అధికారులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

Programme	Vacant seats	EWS Vacant Seats	Programme	Vacant seats	EWS Vacant Seats
B.Com Honours - Computer Applications	04	05	B.Sc. Honours - Electronics	00	02
B.Sc. Honours - Computer Science	09	15	B.Sc. Honours - Chemistry	00	01
B.Sc. Honours - Bio-Chemistry	06	03	B.B.A - Honours	02	03
B.Sc. Honours - Mathematics	02	03	B.B.A - Honours Digital Marketing	02	06
B.Sc. Honours - Data Science	06	04	B.C.A - Honours	03	03
B.Sc. Honours - Statistics	04	03	B.BA - Honours Logistics	02	05
B.Sc. Honours - Physics	01	02	B.Sc. Honours - Health Care Management	30	06
B.Sc. Honours - Micro-Biology	01	01	B.Sc. Honours - Pharmaceutical Manufacturing & Quality	24	06
B.A. Honours - Sanskrit	21	03	B.A. Honours - Special Telugu	21	03



పరిచయం ముందు.. ఆపై మత్తుమందు!!

- యువతులకు మోసాల ముఠా శిక్షణ
- తెలుగు రాష్ట్రాల్లో హనీట్రాప్ బాధితులు
- సీపీ శంఖబ్రత బాగ్చీ



సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లో హనీట్రాప్ బాధితులు చాలా మంది ఉన్నట్లు గుర్తించామని.. వీరంతా ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సూచించారు. ఇప్పటికే విశాఖ నగరంలో రెండు హనీట్రాప్ కేసులు నమోదయ్యాయని, ఇందులో ప్రధాన నిందితుల ఆధారాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం నగర పోలీసు కమిషనరేట్ సమావేశ మందిరంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ మాట్లాడుతూ.. యువకులను ముగ్గులో దింపి ఆపై డబ్బు వసూళ్లకు పాల్పడుతున్న యువతిపై తొలుత భీమిలి స్టేషన్‌లో కేసు నమోదైన నేపథ్యంలో మరో బాధితుడు ముందుకొచ్చి కంచరపాలెం స్టేషన్‌లో అదే నిందితురాలిపై ఫిర్యాదు చేయడంతో మరో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రధానంగా డబ్బున్న వారిని లక్ష్యంగా చేసుకుని వల వేయటం జరుగుతోందని.. ఇదంతా ఓ ముఠా పథకం ప్రకారమే చేయిస్తోందని వెల్లడించారు. అరెస్టయిన నిందితురాలికి ఆ ముఠానే శిక్షణ ఇచ్చి రంగంలోకి దించిందన్నారు. ఇన్‌స్టా, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా డిజిటల్ మార్కెటింగ్ పేరిట పరిచయాలు ఏర్పరచుకుని, ఆ తర్వాత బాధితులకు మత్తు మందు ఇచ్చి తమ ఆధీనంలోకి తెచ్చుకుంటారన్నారు. అలాగే పలు ఫొటోలు, వీడియోలను చిత్రీకరించి.. బ్లాక్‌మెయిల్‌కు పాల్పడతారని, ఆ తర్వాత వారి కుటుంబ సభ్యులను కూడా బెదిరించి అందినంత దోచుకుని తర్వాత విడిచి పెడతారన్నారు. ఈ విషయంలో తెలుగు రాష్ట్రాల్లో చాలా మంది బాధితులున్నట్లు గుర్తించామన్నారు. అయితే అలాంటి వారు ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలన్నారు.

గంజాయి ఏ రూపంలో ఉన్నా గుర్తిస్తాం..

- నగరంలోకి గంజాయి ఏ రూపంలో వచ్చినా గుర్తించేందుకు తగిన కిట్లు త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులు, సిబ్బందితో సిటీ పోలీసు సిబ్బందికి శిక్షణ ఇవ్వటం జరిగిందన్నారు. ఇటీవల కారులో ద్రవరూప గంజాయిని తరలిస్తూ పారిపోయిన నిందితుల వివరాలను గుర్తించామని.. త్వరలోనే వీరిని అదుపులోకి తీసుకుంటామన్నారు.

బాధితులకు చోరీ సొత్తు అందజేత: చోరీ జరిగిన సొత్తును వెంటనే బాధితులకు అందజేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో చోరీ సొత్తు దొరికితే కోర్టు అనుమతులు తీసుకోవాల్సి వచ్చేదని.. ప్రస్తుతం అలాంటిదేమీ లేకుండా వెంటనే బాధితులకు అందజేస్తున్నామన్నారు. చోరీ సొత్తు రికవరీ చేయటంలో ప్రతి నెలా పోలీసు సిబ్బంది ప్రతిభ చూపుతున్నారని కొనియాడారు. సమావేశంలో డి.సి.పి.(క్రైమ్) లతా మాధురి పాల్గొన్నారు.





బీటలు వారిన డ్రాగన్

విరిగిందా.. ఇక అంతే!!

ఆర్కే బీచ్ రోడ్డులో సందర్శకులను ఆకట్టుకునేందుకు, పిల్లలు ఆడుకునే ప్రాంతాల్లో పలు బొమ్మలు ఏర్పాటు చేశారు. అయితే...వాటిలో కొన్ని విరిగిపోయాయి. ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. మరమ్మతులు చేయించాల్సిన అధికారులు కనీసం దృష్టిసారించక పోవడంతో పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. –ఈనాడు, విశాఖపట్నం



తొండం విరిగిన ఏనుగు



డైనోసార్ కాలు ఇలా..

ఐక్యంగా కదిలే.. గొంతెత్తి నినదించే..!

ఉక్కు పరిరక్షణ కోరుతూ మానవహారం

సీపీఎం, సీపీఐ శ్రేణుల సంఘీభావం




జాతీయ రహదారిపై నినాదాలు చేస్తున్న కార్మికులు

ఉక్కునగరం, న్యూస్‌టుడే : విశాఖపట్నం ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భారీ మానవహారం నిర్వహించారు. విశాఖ శివారు అగనంపూడి నుంచి గాజువాక వరకు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన మానవహారంలో ఉద్యోగులు, కార్మికులు, నిర్వాసితులు పాల్గొని చేయి చేయి కలిపారు. ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, పూర్తిస్థాయిలో ఉత్పత్తి సాధించేలా చర్యలు చేపట్టాలని యాజమాన్యాన్ని కోరారు. నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నినదించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సంఘీభావం తెలిపారు. అనంతరం వారు కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు శిబిరంలో మాట్లాడారు. కర్మాగారాన్ని పరిరక్షిస్తామని కేంద్రం చెబుతున్నా... ఒప్పంద కార్మికుల తొలగింపు, శాశ్వత కార్మికుల ఇంటి అద్దె కోత, విద్యుత్తు ఛార్జీల పెంపు, సకాలంలో వేతనాల చెల్లింపు లేకపోవడం.. తదితర అంశాలు కార్మికులను భయాందోళనకు గురిచేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో అన్ని పార్టీలు కలిసి కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తేనే ఉక్కు పరిరక్షణ సాధ్యమవుతుందని వారు అభిప్రాయపడ్డారు. సీఐటీయూ రాష్ట్ర నాయకుడు సీహెచ్.నరసింగరావు, పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్ తదితరులు పాల్గొన్నారు.



ఉక్కు దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, చిత్రంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఉక్కు పోరాట కమిటీ నాయకులు



'సాగర దుర్గ' దర్శనానికి పోటెత్తిన భక్తులు



దసరా నేపథ్యంలో డాల్ఫిన్ హిల్‌పై ఉన్న 'సాగర దుర్గ' దర్శనానికి నౌకాదళ అధికారులు ప్రత్యేకంగా బోట్లను ఏర్పాటు చేశారు. పోర్టు వైపున్న వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నావిగేషన్ చానెల్ దాటి వెళ్లేందుకు తేలే బల్లాల పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. ఆదివారం భక్తులు పోటెత్తడంతో మధ్యాహ్నం ఒంటి గంటకే బోట్లను నిలిపేశారు. ఉదయం నుంచి వేచి ఉన్న భక్తులు నిరాశతో వెనుతిరిగారు.

—ఈనాడు, విశాఖపట్నం

సాగర తీరంలో.. సందడే సందడి



ఆర్కేబీచ్ వద్ద ఆదివారం సముద్రం సుమారు రెండొందల మీటర్లు వెనక్కు వెళ్లింది. తీరంలో రాళ్లు బయటకు కనిపించడంతో పాటు అలల తాకిడి తక్కువగా ఉండటంతో సందర్శకులు సందడి చేశారు. రాళ్ల మధ్య నిలిచిన జలంలో చేపలు పడుతూ... స్వీయ చిత్రాలు తీసుకుంటూ హుషారుగా గడిపారు.

—ఈనాడు, విశాఖపట్నం



విద్యార్థులకు 'అపార్' సదుపాయాలు

12 అంకెల గుర్తింపు కార్డుతో ప్రయోజనాలెన్నో

పెందుర్తి, న్యూస్‌టుడే: దేశంలోని ప్రతీ పౌరుడికి ఆధార్ కార్డు ఉంది. ప్రస్తుతం నిత్య జీవితంలో ఆధార్ గుర్తింపు సంఖ్య భాగమైపోయింది. ఈ గుర్తింపు లేనిదే ఏ పనులు జరగడం లేదంటే అతిశయోక్తి కాదు. ఇదే విధంగా దేశంలోని ప్రతీ విద్యార్థికి 12 అంకెల జీవితకాల గుర్తింపు వ్యవస్థను తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్డును తీసుకొస్తోంది. విద్యార్థుల అకడమిక్ పురోగతిని ఎప్పటికప్పుడు ట్రాక్ చేసి అభ్యసనను మరింత సమర్థంగా నిర్వహించడానికి సహాయపడే విధంగా ప్రత్యేక గుర్తింపును ఆవిష్కరించాలని జాతీయ విద్యా విధానం 2020 యోచించడంతో అందుకు తగ్గ అడుగులు పడుతున్నాయి.

ఇవీ ప్రయోజనాలు..

★ వివిధ కారణాలతో పిల్లలు పలు విద్యా సంస్థలకు మారుతూ ఉంటారు. అపార్ గుర్తింపు సంఖ్య వివిధ రాష్ట్రాల్లోని విద్యా బోర్డులతో ఏకీకృత వ్యవస్థగా పనిచేస్తుంది. ఒక పాఠశాల నుంచి మరొక పాఠశాలకు మారేటప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తారు.

★ అపార్ గుర్తింపుతో విద్యార్థులు డిజిలాకర్‌కు అనుసంధానమవుతారు. విద్యా విషయక విజయాలు, ధ్రువపత్రాలు డిజిటల్ రూపంలో సురక్షితంగా నిల్వ చేసుకోవచ్చు. ఆయా ధ్రువపత్రాలను ఎక్కడైనా డిజిటల్ రూపంలో వినియోగించుకోవచ్చు.



అపార్ సమ్మతి పత్రాలను చూపుతున్న పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

★ పిల్లల అకడమిక్ రికార్డుల పర్యవేక్షణ ద్వారా డ్రాపవుట్లను నివారించే అవకాశం ఏర్పడుతుంది. ఏ కారణం చేతనైనా విద్యార్థి పాఠశాలకు దూరమైతే తక్షణమే తెలుసుకునే అవకాశం ఉంటుంది.

★ రాబోయే రోజుల్లో ఉపకార వేతనాలు, వివిధ ప్రభుత్వ ప్రయోజన పథకాలు, దేశవ్యాప్తంగా వివిధ విద్యా సంస్థల్లో చేరికలు, మార్పులు వంటి అన్ని ప్రక్రియలు ఈ అపార్ ఆధారంగా నిర్వహించే విధంగా రూపకల్పన చేశారు.

★ విద్యార్థులు తమ అకడమిక్ రికార్డులను ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా యాక్సెస్ చేసుకోవచ్చు. విద్యా సంస్థల మధ్య సులభమైన బదిలీలు, ఉద్యోగాలు, ఉన్నత విద్య కోసం దరఖాస్తు చేసేటప్పుడు ఈ వ్యవస్థ రియల్ టైం విధానంలో నవీకరించిన ధ్రువపత్రాలను అందిస్తుంది. ఈ విధానం వల్ల నకిలీ ధ్రువపత్రాల బెడద నిర్మూలించే అవకాశం ఉంటుంది.

★ తల్లిదండ్రుల సమ్మతి కోరుతూ అనుమతి పత్రాల పంపిణీ ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్ తదితర అన్ని విద్యాసంస్థల యాజమాన్యాల నుంచి 9, 10 తరగతుల పిల్లలకు అపార్ గుర్తింపు జారీ కోసం ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా ఈ అపార్ గుర్తింపు సంఖ్య జారీ చేయనున్నారు. 18 ఏళ్లలోపు విద్యార్థులు మైనర్లు కాబట్టి వారి తల్లిదండ్రుల నుంచి సమ్మతి కోరుతూ అనుమతి పత్రాలు తీసుకుంటున్నారు. ఆ మేరకు దసరా సెలవులకు ముందు విద్యార్థులకు అనుమతి పత్రాలు పంపిణీ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆధార్ సంఖ్య ఆధారంగా అపార్ గుర్తింపు ఇస్తారు. 'దసరా సెలవుల అనంతరం వీటిని అందజేయాలని కోరాం. ఆధార్ ఆధారంగా ఈ అపార్ గుర్తింపు సంఖ్య జనరేట్ అవుతుంది. ఆధార్‌కు తప్పనిసరిగా ఫోన్ నెంబర్ అనుసంధానమై ఉండాలి. అలా లేని వారు ముందుగా ఆధార్‌కు ఫోన్ నెంబర్ అనుసంధానం చేసుకోవాలి' అని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్. చంద్రకళ పేర్కొన్నారు.



అపార్ వెబ్‌సైట్

అప్పన్న సన్నిధిలో న్యాయమూర్తులు

సింహాచలం, న్యూస్‌టుడే: అహ్మదాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్. మానవేంద్రనాథ్ రాయ్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారి కుటుంబ సమేతంగా ఆదివారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. వారికి దేవస్థానం అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, అధికారులు స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు



జస్టిస్ సీహెచ్.మానవేంద్రనాథ్ రాయ్‌కి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈవో త్రినాథరావు



కప్పస్తంభం వద్ద ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారి దంపతులు

రవాణా ఛార్జీలతో ఇసుక అందజేత: కలెక్టర్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఇసుక విధానం ద్వారా కేవలం రవాణా ఛార్జీలు మాత్రమే చెల్లించి అవసరమైన ఇసుకను పొందవచ్చునని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్‌తో కలిసి ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతివారం ఇసుక రీచ్‌ల నుంచి ఎంత వచ్చిందో వెల్లడిస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రవాణా సౌకర్యం ద్వారా కూడా ఇసుక పొందవచ్చునన్నారు. చాలినంత స్థాయిలో ఇసుక నిల్వలున్నాయని, ఎవరూ కంగారుపడాల్సిన అవసరం లేదన్నారు. లబ్ధిదారులు తమ సొంత వాహనాల్లో కూడా ఇసుకను తీసుకెళ్లవచ్చునన్నారు. గేట్‌వే ద్వారా పేమెంట్ చేయాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో 8545 టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, ఇంతవరకు 357 బుకింగ్స్ ద్వారా 7000 టన్నుల ఇసుకను సరఫరా చేశామన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, పార్వతీపురం, శ్రీకాకుళం రీచ్‌ల నుంచి విశాఖకు ఇసుక తీసుకొస్తున్నామన్నారు. సచివాలయం, తహసీల్దార్, జేసీ పరిశీలన తర్వాత ప్రైవేటుగా వచ్చే బల్క్ బుకింగ్ ఆర్డర్లను ఆమోదిస్తున్నట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే ట్రాక్టర్‌కు రూ.10 వేలు, లారీ అయితే రూ.25 వేలు జరిమానా విధిస్తామని, రెండు నెలలు జైలు శిక్ష విధిస్తారన్నారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించేందుకు టోల్ ఫ్రీ నెంబరు 0891-2590100ను ఫోన్ చేయాలన్నారు. సీపీ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాపై పోలీసు యంత్రాంగం దృష్టి సారించిందన్నారు. దీనికోసం టాస్క్‌ఫోర్సు బృందాలను సిద్ధంగా ఉంచామన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో సీపీ శంఖబ్రత బాగ్చీ, జేసీ మయూర్ అశోక్

ఫేజ్-3 ఇళ్ల నిర్మాణానికి ఆమోదం

అక్కిరెడ్డిపాలెం(బీహెచ్‌పీవీ), న్యూస్‌టుడే : లంకెలపాలెం దరి సాలాపువానిపాలెంలో ఫేజ్-3లో ఇళ్ల నిర్మాణానికి బీహెచ్‌పీవీ ఎంప్లాయిస్ హౌస్ బిల్డింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సొసైటీ సర్వసభ్య సమావేశం ఆదివారం భెల్ కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు ఎ.వెంకట్రావు మాట్లాడుతూ... సుమారు 24 ఏళ్ల కిందట సొసైటీ ఆధ్వర్యంలో ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ కింద 352 ఇళ్ల నిర్మాణానికి స్థలం కొనుగోలు చేశామన్నారు. వివిధ కారణాలతో ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరిగిందని, ఇప్పుడు నిర్మాణానికి సంబంధించి వీఎంఆర్డీఏ నుంచి అన్ని అనుమతులు పొందామన్నారు. అనంతరం సభలో వార్షిక నివేదిక ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎస్.సాహు, పీవీఎన్.రాజు, పి.భాస్కరరావు, మూర్తి, ఇతర సభ్యులు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న డైరెక్టర్లు

తాతయ్యబాబు ప్రమాణ స్వీకారం 10న

బుచ్చెయ్యపేట, ఎంవీపీ కాలనీ, న్యూస్‌టుడే: ఏపీ గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన బత్తుల తాతయ్యబాబు ఈ నెల 10న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. విజయవాడలోని సంస్థ కార్యాలయంలో ఆ రోజు మధ్యాహ్నం ప్రమాణ స్వీకారోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కూటమి నేతలను ఆదివారం కలిసి ఆహ్వానాలు అందజేశారు. భీమిలి, మాడుగుల ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, నాయకులు దాడి వీరభద్రరావు తదితరులు తాతయ్యబాబును సత్కరించి అభినందించారు.



తాతయ్యబాబును సత్కరిస్తున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

రూ.80.24 లక్షల చోరీ సొత్తు రికవరీ

సెప్టెంబరులో 71 మంది నిందితుల అరెస్టు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: గత నెల సెప్టెంబరులో జరిగిన వివిధ రకాల చోరీలకు సంబంధించిన కేసులను ఛేదించటంలో విశాఖ పోలీసు క్రైమ్ సిబ్బంది పనితీరు బాగుందని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ కితాబు ఇచ్చారు. ఆదివారం ఉదయం పోలీసు సమావేశమందిరంలో జరిగిన రికవరీ మేళాలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గత నెలలో నగర పోలీసు కమిషనరేట్ పరిధిలోని 105 చోరీ కేసులు నమోదు కాగా వాటిలో 77 కేసులను ఛేదించి.. 71 మంది నిందితులను అరెస్టు చేశామన్నారు.

★ ఛేదించిన కేసుల్లో రోబరీ -1, పగటి దొంగతనాలు-4, రాత్రి ఇంటి దొంగతనాలు-13, గొలుసుదొంగతనాలు-9, ఆటో దొంగతనం-1, ద్విచక్రవాహన దొంగతనాలు-23, ఇతర నేరాలు 28 చొప్పున ఉన్నాయన్నారు.

★ 1.2 కిలోల బంగారు ఆభరణాలు, 943 గ్రాముల వెండి ఆభరణాలు, వస్తువులు, రూ.1.54 లక్షల నగదు, 25 మోటారు సైకిళ్లు, ఒక ఆటో, ఒక కారు, 287 మొబైల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, 30 కిలోల కాపర్ వైర్లు స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ సుమారు రూ.80.24 లక్షలుగా ఉంటుందని అంచనా వేశామన్నారు.

★ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నవారు ఇచ్చిన ఫిర్యాదులను ఆధారంగా రూ.40.80 లక్షల విలువైన 272 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నట్లు తెలిపారు. నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు రూ.5.21 కోట్ల విలువ చేసే 3479 ఫోన్లను రికవరీ చేయటం జరిగిందన్నారు. అలానే నగరంలో పలు ఆలయాల్లో జరిగిన దొంగతనాలకు సంబంధించిన నిందితులను అదుపులోకి తీసుకుని భగవంతుని ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం రికవరీ మేళాలో భాగంగా బాధితులకు ఆయా సొత్తును అందజేశారు.



బాధితురాలికి ఫోన్ అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ



రికవరీ చేసిన వెండి, బంగారు ఆభరణాలు

వైకాపా అనాలోచిత నిర్ణయాలతో అసంపూర్తి పనులు

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ అనాలోచిత చర్యలు, అక్రమాల వల్లనే పలు పర్యాటక ప్రాజెక్టు పనులు సకాలంలో పూర్తికాక ప్రభుత్వం ఆదాయం కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం ఉదయం ఆయన అప్పుఘర్ దరి యాత్రి నివాస్, తెన్నేటి పార్కు సమీప మా ఎం.వి. నౌకను సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులపై ఆరా తీశారు. మంత్రితో పాటు పలువురు పర్యాటకశాఖ అధికారులు పాల్గొన్నారు.

● యాత్రి నివాస్‌లో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ గుత్తేదారుడితో నవీకరణ పనుల ప్రగతిపై చర్చించారు. ఇప్పటి వరకు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించగా.. నిధుల కొరత కారణమని చెప్పటంతో మంత్రి అసహనం వ్యక్తం చేశారు. రూ.8.6 కోట్లతో ప్రతిపాదనలు చేయగా, ఇంకా రూ.4 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనాలు ఎందుకు ప్రతిపాదించారని అడిగారు. అప్పటి అధికారులు ఎప్పటికప్పుడు మార్పులు సూచించి, పనులు చేయాలని ఆదేశించారని దీంతో అంచనాల విలువ పెరిగిందని చెప్పటంతో.. అధికారులతో బంధుత్వం ఉందా? ఎలాంటి వర్క్ ఆర్డర్ లేకుండా ఎలా చేస్తారంటూ మంత్రి మండిపడ్డారు. ఈ విషయమై అధికారులతో చర్చించి త్వరలో అందుబాటులోకి వచ్చేలా నిర్ణయం తీసుకుంటామన్నారు. మంత్రి మాట్లాడుతూ ఈ అంశంపై కమిటీ వేసి విచారణ జరిపించనున్నట్లు పేర్కొన్నారు. విశాఖలోని మా ఎంవీ మా నౌకను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అటవీ శాఖ, కోస్టల్ రెగ్యులేషన్ జోన్ అనుమతులకు సంబంధించి సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించి త్వరలో అందుబాటులోకి తీసుకొచ్చేలా నిర్ణయం తీసుకుంటానని పేర్కొన్నారు. రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి అవసరమైన అన్ని వనరులున్నాయని, పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో దీనికి పెద్ద పీట వేస్తామని వెల్లడించారు. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెంచుతామన్నారు.



యాత్రి నివాస్‌లో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

గ్యాస్ లీకై ఒకరి మృతి

- మరో ఇద్దరి పరిస్థితి విషమం
- ఇటుకల పరిశ్రమ ఆవరణలో ప్రమాదం

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలం లైను కొత్తూరు జాతీయ రహదారిని అనుకొని ఉన్న ఫ్యూజన్ ఇటుకల పరిశ్రమకు చెందిన కార్మికుల నివాసంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎలమంచిలి సీఐ ధనుంజయరావు, ఎస్సై ఉపేంద్ర కథనం ప్రకారం.. ఈ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు నివాసం ఉండేందుకు 12 రేకుల షెడ్లు ఉన్నాయి. వీటిలో ఓ షెడ్‌లో ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా సుహని గ్రామానికి చెందిన ఎం.లోక్‌నాథ్, అదే గ్రామానికి చెందిన శాంతినగర్ కాలనీకి చెందిన జి.కృష్ణారెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం పోత్రిపుట్టు గ్రామానికి చెందిన బి.కేశవరావు(52) ఉంటున్నారు. విధులు పూర్తి చేసుకొని పక్కనే ఉన్న ఈ షెడ్‌లోకి ఈ కార్మికులు వెళ్లారు. అప్పటికే వంట గ్యాస్ లీకై షెడ్ అంతా వ్యాపించింది. వెంటనే తలుపులు తీసి వంట చేసుకోవడానికి ఉపక్రమించారు. గ్యాస్ పొయ్యి వెలిగిస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి షెడ్‌పై రేకులు ఎగిరిపోయాయి. ఈ ప్రమాదంలో ఈ ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి, ఇక్కడి నుంచి విశాఖలో ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడ నుంచి కేజీహెచ్‌కు తరలించారు. ఈ ముగ్గురికి కేజీహెచ్‌లో చికిత్స అందిస్తుండగా కేశవరావు ఆదివారం మృతి చెందాడు. మిగిలిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. సీఐ, ఎస్సై ప్రమాద స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంట గ్యాస్ లీక్ కావడంతో ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

★ కేశవరావుకు భార్య రాజులమ్మ, శ్రీకాంత్, సిసింద్రీ ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య గ్రామంలో కూలి పనులు చేస్తుంది. కొడుకులు చదువుకుంటున్నారు. కుమార్తె వివాహానికి చేసిన అప్పులు తీర్చడానికి గ్రామంలో కూలిపని దొరకడం లేదని ఇక్కడ పనిలో చేరాడు.



కేశవరావు (పాత చిత్రం)

నగరానికి మరో ఐదుగురు సి.ఐ.లు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: నగర పోలీసు కమిషనరేట్‌కు మరో ఐదుగురు సి.ఐ.లు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల నగర వ్యాప్తంగా పలువురు సి.ఐ.లకు బదిలీలు జరగ్గా.. వీరిలో అనేక మందిని రేంజ్‌కు కేటాయించారు. రేంజ్ నుంచి పలువురికి నగరంలో పోస్టింగ్‌లు ఇచ్చారు. అయితే కీలక పోలీసు స్టేషన్లలో సి.ఐ.ల మార్పు చేయాల్సి ఉంది. అయితే నగర పరిధిలో ప్రస్తుతం వివిధ విభాగాల్లో సి.ఐ.లు ఉన్నా వారికి పోస్టింగ్ ఇవ్వటానికి అధికారులు సుముఖత వ్యక్తం చేయటం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రేంజ్ నుంచి ఐదుగురు సి.ఐ.లు రానున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి సి.పి. రేంజ్‌లో ఉన్న వారిని నగరానికి తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లో సి.ఐ.లు బదిలీలు జరిగే అవకాశముంది.

బిడ్డకు జన్మనిచ్చిన మానసిక రోగి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన తనిఖీల్లో భాగంగా పట్టుకున్న మతిస్థిమితం లేని మహిళకు ఏయూటీడీ(అసోసియేషన్ ఆఫ్ అర్బన్ అండ్ ట్రైబల్ డెవలప్‌మెంట్)సంస్థ అండగా నిలిచింది. రైల్వేస్టేషన్‌లో అటూఇటూ తిరుగుతున్న మహిళను పట్టుకొని ప్రశ్నించగా ఆమె గర్భిణి అని తేలింది. ఈమెది ఒడిశా రాష్ట్రంగా గుర్తించి టీఎస్ఆర్ మహిళా విభాగంలో చేర్చారు. నెలలు నిండటంతో బలవంతంగా ఆగస్టు 20న కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. అక్కడి వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించగా ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఇరువురు కోలుకోవడంతో గత నెల 30న తల్లి, బిడ్డను తదుపరి సంరక్షణ కోసం ఏయూటీడీ సంస్థ మేనేజర్ జ్యోతిర్మయికు అప్పగించారు. కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ శివానంద, ప్రసూతి విభాగ ప్రొఫెసర్లు డాక్టర్ ఉషారాణి, డాక్టర్ సంధ్యాదేవి, డాక్టర్ సత్యకళ, డాక్టర్ హర్షిత, ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	137	130
డ్రెస్డ్	199	230
స్కిన్‌లెస్	226	240

పెందుర్తి

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - శ్వాగ్

సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలి

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి నమ్మిదొడ్డి తెదేపా కార్యాలయంలో ఆదివారం సాయంత్రం వార్డు తెదేపా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వార్డు తెదేపా అధ్యక్షుడు పాల అచ్చిలనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెదేపా సభ్యత్వ నమోదుకు కార్యకర్తలంతా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. బూత్ ఇన్‌ఛార్జిలంతా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు ఎం.రవి, చుక్క వెంకన్న, పాల నగేశ్, కాకి నారాయణ, సర్వరే ఆలం, అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

పరవాడ, న్యూస్‌టుడే

సమస్య: జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలోని ఎస్ఎస్10బి1/4/3 నెంబర్ స్తంభానికి ఉన్న దీపం వెలగడం లేదు. చీకటి కారణంగా విష పురుగులు, వీధి కుక్కల సంచారంతో భయాందోళన చెందుతున్నాం. స్తంభానికి పొదలు అల్లుకున్నాయి.
– సీహెచ్.వి.రాజారావు, దేశపాత్రునిపాలెం

సమాధానం: మీ ప్రాంతంలో వీధి దీపం వెలిగేలా చర్యలు చేపడతాం.
– రౌతు శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్

పల్లెలు వ్యర్థాలమయం

పరవాడ, న్యూస్‌టుడే

స్వచ్ఛతాహీ సేవ, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ పేరుతో పట్టణాలు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నా గ్రామీణ ప్రాంతాల్లో సక్రమంగా అమలుకావడం లేదు. దీంతో రహదారుల పక్కన, చెత్తకుండీల వద్ద వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. దోమలు, ఈగలు వృద్ధి చెందడంతో ప్రజలు తరచూ అనారోగ్య బారిన పడుతున్నారు. పరవాడ మండలంలోని పలు గ్రామాల్లో గత కొద్ది రోజుల నుంచి చెత్తను తరలించకపోవడంతో ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. వాడచీపురుపల్లి, తిక్కవానిపాలెం, గొర్లెవానిపాలెం, పరవాడ, పి.భోనంగి, కలపాకలోని రహదారుల పక్కన చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వ్యర్థాలు కుళ్లడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని ప్రయాణికులు, గ్రామస్థులు వాపోతున్నారు. దోమలు బెడద కారణంగా రాత్రుళ్లు కంటి నిండా నిద్ర కరవవుతోందని చెబుతున్నారు. చెత్తను శునకాలు, పందులు చిందరవందర చేయడంతో పరిసరాలను అధ్వానంగా తయారవుతున్నాయని వాపోతున్నారు. ప్లాస్టిక్ గ్లాసులు, సంచులను పశువులు తినడంతో మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చెత్తను తొలగించడానికి చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.


తిక్కవానిపాలెంలో పేరుకుపోయిన చెత్త


వాడచీపురుపల్లిలోని ప్రధాన రహదారిలో...


పరవాడలో రహదారిని ఆనుకుని..


వాడచీపురుపల్లి సామాజిక భవనం వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్రశాంత వాతావరణంలో ఊరేగింపు జరపాలి

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపాలు ఏర్పాటు చేసి పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఊరేగింపు తదితర కార్యక్రమాలను కమిటీల ప్రతినిధులు ప్రశాంత వాతావరణంలో జరపాలని వెస్ట్ జోన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి సూచించారు. దుర్గాదేవి మండపాల నిర్వాహకులతో ఆదివారం చినముషిడివాడలోని ఓ ప్రయివేటు కల్యాణ మండపంలో ఏసీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. డీజే సౌండ్ బాక్సులకు అనుమతి లేదన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో మహిళలతో అశ్లీల నృత్యాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఊరేగింపు సమయంలో ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పెందుర్తి, గోపాలపట్నం సీఐలు కె.వి.సతీశ్‌కుమార్, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.


ఉత్సవాల నిర్వాహకులకు సూచనలిస్తున్న వెస్ట్ జోన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి

తాగునీటి వృథాకు ఏదాది

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి మరడ దాసరిపేట నుంచి నమ్మి దొడ్డి కూడలికి వెళ్లే రహదారిని ఆనుకుని ఉన్న పైపు లైను వాల్వు నుంచి తాగునీరు వృథా అవుతోంది. గత ఏడాది కాలంగా నీరు లీకవుతున్నా పట్టించుకునే వారే కరవయ్యారని స్థానికులు వాపోతున్నారు. కుళాయిల ద్వారా సరఫరా సమయంలో మరింత ఎక్కువ నీరు నేలపాలవుతోందని, దీనివల్ల శివారు ప్రాంతాలకు సక్రమంగా సరఫరా కావడం లేదని మహిళలు వాపోతున్నారు. మరమ్మతులు చేపట్టి వృథాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.


వృథాగా పోతున్న నీరు

అంధకారంలో సామాజిక మరుగుదొడ్లు

వేపగుంట, న్యూస్‌టుడే: జీవీఎంసీ 92వ వార్డు బంటాకాలనీలోని సామాజిక మరుగుదొడ్లు అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గతవారం రోజులుగా మరుగుదొడ్లకు విద్యుత్తు సరఫరా లేకపోవడంతో వినియోగదారులు నానా అవస్థలు పడుతున్నారు. కొండవలు ప్రాంతాల్లోని కొంతమందికి ఇప్పటికీ మరుగుదొడ్లు లేకపోవడంతో వారంతా వీటిని నిత్యం వినియోగించుకుంటున్నారు. జీవీఎంసీ జోనల్ అధికారులు సమస్యను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


మరుగుదొడ్ల వద్ద అలముకున్న చీకట్లు

కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

పెందుర్తి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తోంది. జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి ఏకలవ్య కాలనీలో రూ.18 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ తెదేపా ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం రోడ్డు పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని సిబ్బందికి సూచించారు. త్వరలోనే వార్డు పరిధిలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పీలా జితేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులను పరిశీలిస్తున్న జీవీఎంసీ తెదేపా ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు

కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాలను ఉచితంగా కేటాయించాలి

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే: కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాలు ఉచితంగా కేటాయించాలని కల్లు గీత కార్మికుల జిల్లా సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. నరవలో గీత కార్మికుల 8వ మహాసభ ఆదివారం నిర్వహించారు. పలువురు సంఘం ప్రతినిధులు ప్రసంగించారు. ప్రస్తుతం మద్యం దుకాణాల కేటాయింపు 20 శాతానికి పెంచాలని సంఘం సభ్యులు కోరారు. ఎటువంటి టెండరు పద్ధతి లేకుండా ఉచితంగా దుకాణాలు కేటాయించాలని కోరారు. గీత కార్మికుల కుటుంబాల్లోని యువతకు ఉపాధి కల్పించడం కోసం నీరాతాటి ఉత్పత్తుల పరిశ్రమను ఏర్పాటు చేయాలన్నారు. చెట్టు మీద పన్ను హక్కు కల్పించి భవిష్యత్తుకు భరోసా కల్పించాలన్నారు. కేరళలో అమలు చేస్తున్న కల్లు విధానాన్ని రాష్ట్రంలోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశం అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంపీగి పోలయ్య, కార్యదర్శిగా జక్కల సంతోష్, ఉపాధ్యక్షుడిగా పట్నాల కృష్ణ, సహాయ కార్యదర్శిగా రాయి సోమునాయుడు, డైరెక్టర్‌గా దమ్ము నర్సింహులను ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యర్ర దేముడు తదితరులు పాల్గొన్నారు.


కల్లుగీత కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యర్ర దేముడు

మర్యాదపూర్వక కలయిక

పరవాడ, న్యూస్‌టుడే: ఏపీ హౌసింగ్ బోర్డు ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బత్తుల తాతయ్యబాబు ఆదివారం పరవాడ మండలం వెన్నెలపాలెంలోని తన స్వగృహంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాతయ్యబాబును బండారు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, మాజీ సర్పంచి అట్టా సన్యాసి అప్పారావు, అనకాపల్లి జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రొంగలి గోపాలకృష్ణ, చీపురుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


తాతయ్యబాబుని శాలువాతో సత్కరించిన మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ప్రసాద్ పథకం పనుల పురోగతిపై సమీక్ష

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రసాద్ పథకం పనులపై రాష్ట్ర దేవాదాయశాఖ అదనపు కమిషనర్ (ఏడీసీ) కె.రామచంద్రమోహన్ ఆదివారం సమీక్ష నిర్వహించారు. సింహగిరిపై దేవస్థానం అతిథి గృహంలో జరిగిన కార్యక్రమంలో ఈవో వేండ్ర త్రినాధరావు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, పర్యాటక శాఖ ఈఈ మదన్‌మోహన్ పాల్గొన్నారు. సింహగిరి బస్‌స్టాండు ఆవరణలో జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పురోగతిపై చర్చించారు. బస్‌స్టాండు మధ్యలో బస్‌బే నిర్మాణానికి ఏడీసీ అభ్యంతరం తెలిపారు. ఉత్సవాల సమయంలో తగినంత స్థలం లేకుంటే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో బస్‌బే మూలన నిర్మించాలని, మిగిలిన పనులు యథావిధిగా కొనసాగించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని విన్నపం

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కార్మికుల్ని అన్ని విధాలుగా భయ భ్రాంతులకు గురి చేస్తున్న ఉక్కు యాజమాన్యంతో చర్చించి, వివిధ సమస్యలు పరిష్కరించాలని ఉక్కు పోరాట కమిటీ నాయకులు కోరారు. ఆదివారం వారు తెదేపా రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి వినతులు అందించారు. ఇంటి అద్దె చెల్లించాలని, విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని కోరుతూ.. ఈడీ(వర్క్స్) కార్యాలయం వద్ద సుమారు 24 గంటల పాటు నిరసన తెలియజేసినా, ఓ మహిళా ఉద్యోగి అస్వస్థతకు గురైనా అధికారులు స్పందించలేదని వివరించారు. సకాలంలో వేతనాలు అందక యువ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యలపై ఎంపీ శ్రీభరత్‌తో కలిసి ఉక్కు సీఎండీ ఎ.కె.సక్సేనాతో చర్చించేందుకు చొరవ చూపాలని పల్లాను కోరారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, పి.వి.రమణమూర్తి, జి.నరేంద్రకుమార్, ఎన్.సింహాద్రి, డి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లాకు సమస్య వివరిస్తున్న ఉక్కు నాయకులు

నేడు సబ్బవరంలో ఎమ్మెల్యే పర్యటన

సబ్బవరం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోమవారం సబ్బవరం మండలంలో పర్యటించనున్నారు. దీనికి సంబంధించిన వివరాలను మండల జనసేన అధ్యక్షుడు కర్రి కనకరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జీవీఎంసీ 88వ వార్డు నంగినారపాడులోని సంజీవని డెంటల్ ఆసుపత్రి ప్రారంభోత్సవం చేస్తారన్నారు. ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంపై నిర్మించిన మొదటి అంతస్తు భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

పరవాడ, న్యూస్‌టుడే: దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా పరవాడ బొంకులదిబ్బలోని దుర్గాదేవి మండపం వద్ద ఆదివారం రాత్రి మ్యూజికల్ ఛైర్, తాడాట, లెమన్ అండ్ స్పూన్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీల్లో విద్యార్థులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిభ చాటారు. విజేతలకు దసరా రోజున బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు. ఉదయం ఆలయ హంస మూలన పండితులు శ్రీమద్రామాయణం పారాయణం చేశారు.

గంజాయి విక్రయిస్తున్న నిందితుడి అరెస్టు

నార్కట్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే: హైదరాబాద్ నుంచి అక్రమంగా గంజాయిని తీసుకొచ్చి నార్కట్‌పల్లి శివారులో విద్యార్థులకు విక్రయిస్తున్న ఓ యువకుడిని నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండల కేంద్రంలోని ద్రోనంరాజు నగరానికి చెందిన సాగి దిలీప్‌వర్మ జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించడానికి గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నాడు. అందులో భాగంగా హైదరాబాద్‌లో 2 కిలోల గంజాయిని కొనుగోలు చేసి కొంత మేరకు అక్కడే విక్రయించగా మిగిలిన 650 గ్రాముల గంజాయిని శనివారం ఉదయం ద్విచక్రవాహనంపై నార్కట్‌పల్లి శివారులోని స్పెక్ట్రా వెంచర్‌కు తీసుకొచ్చి ఓ కళాశాల విద్యార్థులకు, ఇతర వ్యక్తులకు చిన్న చిన్న పొట్లాల్లో నింపి విక్రయించడానికి సిద్ధమయ్యాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై క్రాంతికుమార్, సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని తనిఖీలు చేయగా దిలీప్‌వర్మ అనుమానస్పదంగా కనిపించాడు. అతన్ని విచారించి 8 పొట్లాల్లోని సుమారుగా రూ.16,500 విలువగల గంజాయితో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో ఇద్దరిపైన కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు వివరించారు.

లలితా స్వరూపిణి.. శ్రీచక్ర సంచారిణి


సుజాతనగర్‌లో లలితా త్రిపురసుందరి


మహాలక్ష్మి అలంకరణలో నాయుడుతోట గాయత్రీదేవి


శమశక్తినగర్‌లో కరెన్సీ నోట్లతో అలంకరణ


గవరజగ్గయ్యపాలెంలో..


పెందుర్తి ఉత్తరాంధ్ర శబరిమల క్షేత్రంలో..


పరవాడ బొంకులదిబ్బలో దీపారాధన

శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జగన్మాత ఆదివారం శ్రీలలితా త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నియోజకవర్గంలోని పలు దేవాలయాలు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను వైభవోపేతంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని శ్రీలలితా అష్టోత్తర శతనామావళితో అర్చించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొని లలితా సహస్రనామ పారాయణం చేశారు. పలు చోట్ల అన్నదానాలు జరిపారు.
– న్యూస్‌టుడే, పెందుర్తి, వేపగుంట, పరవాడ, సబ్బవరం


మణిపురంలో..


దేవీపురం శ్రీరాజరాజేశ్వరి


దుర్గానగర్‌లో..


పోలిపల్లి కూడలిలో..


వాడచీపురుపల్లిలో..


ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంలో..


శారదాపీఠంలో...


రాంపురం మహాకామేశ్వరీ పీఠంలో...


పెందుర్తి రాజుచెరువులో..


సాయినగర్‌కాలనీలో..


పిట్టవానిపాలెంలో అన్నసమారాధన


కృష్ణానగర్‌లో..


ఎస్ఆర్‌పురంలో..

పల్లె దారి.. అధ్వానంగా మారి

ఫోకస్

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలోని రాజు గారి బంజరు నుంచి నారపాడు వెళ్లే సుమారు 4 కిలోమీటర్ల రహదారి ధ్వంసమై దారుణంగా తయారైంది. ఈ రహదారి గుండా సుమారు పది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వీరిందరికీ ఈ రోడ్డు తప్ప మరో దిక్కులేదు. ప్రస్తుతం భారీ గుంతలతో రాళ్లుతేలి ప్రమాదకరంగా మారింది. ద్విచక్రవాహనదారులు, ఆటోలు రాకపోకలు సాగించలేక నానా అవస్థలు పడుతున్నారు. తాము పండించిన కూరగాయలను నగరంలోని రైతు బజార్లకు తీసుకెళ్లేందుకు ముప్పుతిప్పలు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. గత పాలకులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని, కూటమి నాయకులైనా చర్యలు తీసుకుని బంజరు నుంచి నారపాడు వరకు రహదారి నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


బల్జిపాలెం సమీపంలో ధ్వంసమైన నారపాడు రహదారి

పగటి వెలుగులు ఆగేదెన్నడో..?

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి పిట్టవానిపాలెంలోని హైమాస్టు దీపాలు పగలు రాత్రి తేడా లేకుండా నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. దీనివల్ల దీపాలు తరచూ మరమ్మతులకు గురవ్వడంతో పాటు విద్యుత్తు వృథా అవుతోంది. విద్యుత్తును పొదుపు చేయాలని అవగాహన కల్పించే అధికారులే ఇలా వృథా చేయడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకునేవారే కరవయ్యారని గ్రామస్థులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పగటి వెలుగులకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.



దర్పణం

మురుగుతో ముప్పుతిప్పలు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో కాలువలు లేక ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోతోంది. ఎస్టీబీఎల్ సినిమాహాలు రహదారిలో మురుగు నిలిచిపోవడంతో ఈగలు, దోమలు విజృంభించి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసనతో నానా అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. కొన్నిచోట్ల కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో మట్టి మేటలు వేసి నీరు నిలిచిపోతోంది. దీనికి వర్షపు నీరు తోడవ్వడంతో మురుగంతా రహదారులపై ప్రవహిస్తోంది. పాలకులు, పంచాయతీ అధికారులు స్పందించి మురుగు నిలిచిపోకుండా కాలువ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.


ఎస్టీబీఎల్ సినిమా హాలు వీధిలో మురుగు

అర్ధరాత్రి సీపీ ఆకస్మిక తనిఖీ

ఎండాడ, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై పగలు, రాత్రి ప్రమాదాల నివారణతో పాటు ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు అవసరమైన చర్యల విషయంలో ట్రాఫిక్ పోలీసులు చురుగ్గా వ్యవహరించాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సిబ్బందికి బాధ్యతలు గుర్తు చేశారు. ఎండాడ కూడలిలోని ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయాన్ని శనివారం అర్ధరాత్రి ఆయన ఆకస్మికంగా సందర్శించారు.

భీమిలి

సినిమాలు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్ – సత్యం సుందరం
రాములమ్మ– దేవర
తాతా – దక్షిణ, సప్తగిరి– శ్వాగ్
చేటుమహరాజ్ (ఆనందపురం) – దేవర

వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలెన్నో..

పద్మనాభం, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో భాగంగా రేవిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. జీసీడీవో డాక్టర్ కాలేషా బేగం మాట్లాడుతూ వృత్తి విద్య అభ్యసించడం ద్వారా ఉపాధి అవకాశాలు సులువుగా పొందవచ్చునన్నారు. ఆటోమొబైల్, టైలరింగ్ అంశాల్లో ఆసక్తి గల 30 మందిని శిక్షణకు పంపించారు. ఈ మేరకు అవసరమైన సామగ్రిని జిల్లా ఒకేషనల్ కో-ఆర్డినేటర్ రిషికేశ్ అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.శంకరరావు, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

ఎండాడ, న్యూస్‌టుడే

మేమున్నాం.. మీకు తోడుగా
80086 11711, 99122 22247
సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సమస్య: సాగర్‌నగర్ అల్లూరి కూడలి రహదారిలో దుకాణాల ముందు ఇరువైపులా ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయడంతో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. –స్థానికులు, సాగర్‌నగర్
సమాధానం: దుకాణాలను ఆనుకుని రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాలపై చర్యలు తీసుకుంటాం. –కె.వి.ఎస్.ఎన్.ప్రసాద్, ఆరిలోవ ట్రాఫిక్ సీఐ

సమస్య: ఎండాడ-రుషికొండ 100 అడుగుల రహదారిలో పలు విద్యుత్ దీపాలు పనిచేయక అలంకారప్రాయంగా ఉన్నాయి. –కిషోర్, స్థానికుడు
సమాధానం: విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. –సురేష్, విద్యుత్ ఏఈ

సమస్య: దుర్గానగర్(ఎండాడ)ను ఆనుకుని ఉన్న లేఅవుట్‌లో మురుగు కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీంతో దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. –స్థానికులు, లేఅవుట్ వాసులు
సమాధానం: కాలువల శుభ్రతకు చర్యలు తీసుకుంటాం. –కిషోర్, ఆరోగ్య అధికారి

వన్యప్రాణులను రక్షిద్దాం.. పర్యావరణాన్ని కాపాడదాం..



రోజురోజుకు అడవుల విస్తీర్ణం తగ్గి జనావాసాలు పెరుగుతుండడంతో ఎన్నో జాతుల సంతతి క్షీణిస్తోంది. ఈ నేపథ్యంలో పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో కీలకపాత్ర పోషించడమే కాక.. మానవశ్రేయస్సుకు ఎంతో సహకరిస్తున్న వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.
– న్యూస్‌టుడే, పీఎంపాలెం, ఎండాడ

విశాఖ జూలో 8వ తేదీ వరకు వన్యప్రాణి వారోత్సవాలు

నగరంలో కాంక్రీటు వనాల మధ్య జీవిస్తున్న ప్రజలకు పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో పలు రకాల వన్యప్రాణులను ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల (విశాఖ జూ) పరిచయం చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడే విధంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు, ధ్రువపత్రాలు అందిస్తోంది. జంతువులను, వృక్ష సంపదను కాపాడుకోవడం వల్ల మానవాళికి జరిగే ప్రయోజనాలను దత్తత స్వీకార కార్యక్రమాలు, అవగాహన సదస్సుల ద్వారా తెలియజేస్తోంది.



రూ.1.80 లక్షలతో తెల్లపులిని దత్తత తీసుకున్న ఎస్ఎస్ మిట్టల్ సంస్థ ప్రతినిధులు (పాత చిత్రం)

జంతువుల దత్తత ఇలా

జంతువుల పట్ల ప్రజల్లో ప్రేమ, వాత్సల్యం పెంపొందించేందుకు మూగజీవాల ఆహార, ఆరోగ్య సంరక్షణ కోసం ఇక్కడ దత్తత స్వీకార ప్రక్రియ చేపడుతున్నారు. పిల్లలు ఇష్టపడే వన్యప్రాణికి ఆహారం అందించేందుకు ఒక్క రోజుకు రూ.100 నుంచి ధరలు అందుబాటులో ఉంచారు. ఏడాది కాలానికి సూచించిన నగదు ఇచ్చిన వారి పేరు, వివరాలతో ఆయా ఎన్‌క్లోజర్ వద్ద ప్రచార బోర్డు ఏర్పాటు చేస్తున్నారు. రూ.10 వేల నుంచి రూ.30 వేలతో జంతువు దత్తత తీసుకుంటే 5గురు సభ్యులకు ఏడాదికి రెండు సార్లు జూలోకి ఉచిత ప్రవేశంతో పాటు ధ్రువపత్రం అందజేస్తున్నారు. రూ.30 వేలు పైబడి దత్తత స్వీకారానికి ఉచిత ప్రవేశం, జూ టీషర్టు, టోపీ ఇస్తారు. 90 జాతులకు చెందిన 800కి పైగా వన్యప్రాణులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. www.vizagzoo.com వెబ్‌సైట్ ద్వారా వివరాలు తెలుసుకుని ఆన్‌లైన్ చెల్లింపులు సైతం చేపట్టవచ్చు.

సంవత్సరం	దత్తత తీసుకున్న వారి సంఖ్య	వచ్చిన నగదు
2023	31 మంది	రూ.7.5 లక్షలు
2024 (సెప్టెంబరు వరకు)	25 మంది	రూ.8.5 లక్షలు

★ ఏటా ఐఓసీఎల్ సంస్థ దత్తత స్వీకారానికి ముందుకొస్తోంది. ఈ ఏడాది రూ.3 లక్షలు అందించి రైనోను దత్తత తీసుకుంది. ★ ఫ్లూయంట్ గ్రిడ్ లిమిటెడ్ సంస్థ రూ.1.80 లక్షలకు జిరాఫీని ఈ ఏడాది జూన్ నెలలో దత్తత తీసుకుంది. ★ ఎస్ఎస్ మిట్టల్ కంపెనీ రూ.1.80 లక్షలకు తెల్లపులి దత్తతకు నగదు చెల్లించింది.

పిల్లలకు అవగాహన కల్పించాలి

వన్యప్రాణుల సంరక్షణ సామాజిక బాధ్యతగా భావించి జంతు ప్రదర్శనశాల వేదికగా ఏటా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పిల్లల పుట్టిన రోజు, పెద్దల పెళ్లి రోజు వేడుకల కోసం ఎంతో నగదు వెచ్చిస్తుంటారు. ఆ మొత్తంతో జూలో జంతువులను దత్తత తీసుకుంటే వారికి జీవితాంతం గుర్తుండిపోతుంది. ఈ విషయంలో బాల్యం నుంచే పిల్లలకు అవగాహన కల్పిస్తే పర్యావరణ పరిరక్షణకు పాటు పడే అవకాశం ఉంటుంది. జంతువుల దత్తత కోసం పెద్ద మొత్తంలో నగదు చెల్లించే వారికి 80జీ(5) ఆదాయపు పన్ను 1961 చట్టం ప్రకారం మినహాయింపు కూడా లభిస్తుంది.



–మంగమ్మ (అటవీశాఖ డెప్యూటీ కన్జర్వేటర్)

అర్ధరాత్రి సీపీ ఆకస్మిక తనిఖీ

ఎండాడ, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై పగలు, రాత్రి ప్రమాదాల నివారణతో పాటు ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు అవసరమైన చర్యల విషయంలో ట్రాఫిక్ పోలీసులు చురుగ్గా వ్యవహరించాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సిబ్బందికి బాధ్యతలు గుర్తు చేశారు. ఎండాడ కూడలిలోని ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయాన్ని శనివారం అర్ధరాత్రి ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా కార్యాలయ పరిధిలోని అన్ని స్టేషన్లకు సంబంధించిన కేసుల దస్త్రాలను పరిశీలించి వాటి స్థితిగతులపై ఆరా తీశారు. ఎలాంటి కేసులైనా సుదీర్ఘకాలం పెండింగ్‌లో లేకుండా చూడాలని ఏసీపీని ఆదేశించారు. జాతీయ రహదారిపై పలు కూడళ్లను ఎప్పటికప్పుడు పరిశీలించి సూచికల వ్యవస్థ నిర్విరామంగా పని చేసేలా చూడాలన్నారు. కొన్ని చోట్ల సెంట్రల్ లైటింగ్ దీపాలు పని చేయడం లేదని, సంబంధిత విభాగాధికారులతో మాట్లాడి ఆ సమస్య పరిష్కారమయ్యేలా చూడాలన్నారు.



ఎండాడ ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయంలో దస్త్రాలు పరిశీలిస్తున్న సీపీ

దారి లేకుండా చేసిన వారిపై ఫిర్యాదు

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం మండలం గండిగుండంలో ఏపీఐఐసీ లేఅవుట్ కోసం గతంలో ఎంపీ నిధులతో వేసిన తారురోడ్డును తొలగించడంపై ఆనందపురం పోలీసుస్టేషన్‌లో ఆదివారం స్థానిక నాయకులు ఫిర్యాదు చేశారు. రామవరం, కోలవానిపాలెం, భీమన్నదొరపాలెం సర్పంచులు ఆనందపురం కూడలిలో విలేకరులతో మాట్లాడుతూ ఓ కంపెనీ దౌర్జన్యంగా ఇందుకు పాల్పడిందన్నారు. ఈ విషయమై ఆనందపురం సీఐ సీహెచ్.వాసునాయుడు వద్ద ప్రస్తావించగా క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

గొట్టిపల్లిలో ఉచిత వైద్యశిబిరం

ఆనందపురం, న్యూస్‌టుడే: మండలంలోని గొట్టిపల్లి గ్రామంలో ఆనందపురం రాయల్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం జరిగింది. డా.లక్ష్మణ ఆధ్వర్యంలో 200 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

బీచ్‌రోడ్డులో మారథాన్



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

మధురవాడ, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులో సాగరతీరం ద్వారా వద్ద 'వైజాగ్ ట్రయల్ రన్' ఆధ్వర్యంలో మూడో ఎడిషన్‌లో భాగంగా వైజాగ్ జూ మారథాన్ పేరుతో ఆదివారం నిర్వహించిన పోటీల్లో పలువురు ఔత్సాహికులు పాల్గొన్నారు. సంబంధిత ద్వారం నుంచి రుషికొండ వైపు 3కె, 5కె, 10కె, 21కె పేరిట నాలుగు విభాగాలుగా ఈ పోటీలు నిర్వహించారు. సుమారు 1300 మంది పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు సంబంధిత పోటీల డైరెక్టర్ డాక్టర్ కృష్ణ చైతన్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. అసోసియేషన్ ఆధ్వర్య కార్యదర్శులు యోగేష్, ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

తొట్లకొండపై పర్యావరణ పరిరక్షణ



విత్తన బంతులతో క్రెడాయ్, వైజాగ్ రన్నర్స్ ప్రతినిధులు

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: విశాఖపట్నం కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్), వైజాగ్ రన్నర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని పెద మంగమారిపేట తొట్లకొండపై విత్తన బంతులు వేసే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వీఎంఆర్‌డీఏ డివిజనల్ అటవీ అధికారి శాంతి స్వరూప్ దీన్ని ప్రారంభించారు. సుమారు 30 రకాల విత్తనాలతో కూడిన దాదాపు 10వేల సీడ్‌బాల్స్‌ను తొట్లకొండపై వేశామని, పర్యావరణ పరిరక్షణకు తమవంతు కృషి చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. క్రెడాయ్ ఛైర్మన్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీచక్రవాసిని.. లలితా స్వరూపిణి

శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భీమిలి నియోజకవర్గంలోని పలు దేవాలయాలు, మండపాల కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం విశేష పూజలు కొనసాగాయి. కొన్ని చోట్ల అమ్మవారు లలిత త్రిపుర సుందరిగా, మరికొన్ని చోట్ల వేర్వేరు రూపాల్లో భక్తుల పూజలందుకున్నారు. జగన్మాతకు మహిళలు సామూహిక కుంకుమార్చనలు జరిపారు. భవానీ దీక్షాపరులు సంకీర్తనలతో కొలిచారు. పలుచోట్ల అన్నసమారాధనలు ఘనంగా నిర్వహించారు.
–న్యూస్‌టుడే, సింహాచలం, ఎండాడ, తగరపువలస, గ్రామీణభీమిలి, భీమునిపట్నం, సాగర్‌నగర్, పద్మనాభం, ఆనందపురం



విజినిగిరిపాలెంలో.. తోటపాలెం వద్ద ఏపీఈపీడీసీఎల్ యూత్ ఆధ్వర్యంలో.. చిన మంగమారిపేట అనన్య కాలనీ వద్ద.. మజ్జివలస ఎస్సీకాలనీలో.. టి.నగరపాలెంలో.. పెద మంగమారిపేట రామాద్రిలో.. చిట్టివలస సంతపేటలో.. రేవళ్లపాలెంలో..



శ్రీదుర్గాలమ్మ ఆలయంలో సామూహిక కుంకుమార్చన



చంద్రంపాలెం జాతరగట్టుపై.. గీతం వైద్య కళాశాల ప్రాంగణంలో.. సాగర్‌నగర్ బంగారమ్మ ఆలయంలో.. కృష్ణాపురం కాలనీలో.. భీమిలి రాయిపాలెంలో.. సాగరతిరుమల క్షేత్రంలో.. భీమిలి మహాలక్ష్మీపురంలో.. ఆనందపురం బీసీ కాలనీలో..

ఎన్‌సీసీతో ప్రయోజనాలెన్నో..

సాగర్‌నగర్, ఎండాడ, న్యూస్‌టుడే: దేశసేవలో ఎన్‌సీసీ కీలకపాత్ర పోషిస్తుందని 13 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాంప్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్‌కుమార్ అన్నారు. రుషికొండ గాయత్రి విద్యా పరిషత్ (జీవీపీ) డిగ్రీ అండ్ పీజీ కోర్సుల కళాశాల వేదికగా ఆదివారం నుంచి చేపట్టిన ఉత్తరాంధ్ర జిల్లాల ఎన్‌సీసీ (నేవీ, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్) క్యాడెట్ల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎన్‌సీసీ ద్వారా లభించే ప్రయోజనాలను వివరించారు. ఈనెల 14వ తేదీ వరకు ఈ శిక్షణ కొనసాగుతుందని జీవీపీ ఎన్‌సీసీ విభాగాధికారి కెప్టెన్ ఆర్.బి.అనంతరావు పేర్కొన్నారు. కెప్టెన్ ఉమామహేశ్వరి, సుబేదార్ మేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌సీసీ క్యాంప్ కమాండింగ్ ఆఫీసర్ నీరజ్‌కుమార్

21 నుంచి మరిడిమాంబ ఉత్సవాలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: శ్రీమరిడిమాంబ ఉత్సవాలు ఈనెల 21వ తేదీ నుంచి నిర్వహించాలని నిర్ణయించారు. ఈమేరకు దేవాలయ ప్రాంగణంలో ఆదివారం ధర్మకర్త గాడు అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్ణయించారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. ★ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అప్పన్న ఆలయంలో అమ్మవార్ల తిరువీధి వేడుకగా జరిగింది. ఉదయం ఆలయ హంస మూలన పండితులు శ్రీమద్రామాయణం పారాయణం చేశారు.

అమ్మవారి ఘటాల ఊరేగింపు

మధురవాడ, సాగర్‌నగర్, ఎండాడ, న్యూస్‌టుడే: మధురవాడ టైలర్స్ కాలనీ విజయదుర్గాదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం మేళతాళాలు, కోలాట ప్రదర్శనలు, వివిధ రకాల వేషధారణలతో అమ్మవారి పల్లకీ సేవ శోభాయాత్ర, ఘటాల ఊరేగింపు వైభవోపేతంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు. ★ బీచ్‌రోడ్డు (సాగర్‌నగర్)లో కొలువైన మొగదారమ్మ మహాలక్ష్మి పద్మాలయ ఆలయంలో ఆదివారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ సూరపనేని లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



టైలర్స్ కాలనీలో అమ్మవారి ఘటాలతో భక్తులు

పోలీసులకు చిక్కిన బైక్ రేసింగ్ యువకులు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: మధురవాడ పనోరమ హిల్స్ రోడ్డులో ద్విచక్రవాహనాలతో రేసింగ్‌కు పాల్పడుతున్న 5గురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు నార్త్‌జోన్ ట్రాఫిక్ సీఐ ఎస్.కాంతారావు ఆదివారం తెలిపారు. ఆ వివరాలిలా.. సంబంధిత రోడ్లపై తరచూ కొందరు ఆకతాయి యువత ఆధ్వర్యంలో రేసింగ్ పోటీలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ట్రాఫిక్ ఎస్సై జి.ప్రసాద్, శాంతిభద్రతల ఎస్సై కె.భాస్కరరావు సిబ్బందితో కలిసి శనివారం సాయంత్రం నిఘా కొనసాగించారు. ఆ సమయంలో 5గురు యువకులు సైలెన్సర్లు లేని వాహనాలపై పెద్ద శబ్దాలతో అతివేగంతో దూసుకురావడాన్ని గుర్తించి పట్టుకున్నారు. ఆపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేశారు. ముందుగా వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ విధంగా రేసింగ్‌లు చేస్తూ మొదటిసారి పోలీసులకు చిక్కితే మూడు నెలల పాటు, రెండో సారి దొరికితే పూర్తిగా డ్రైవింగ్ లైసెన్సుల రద్దుకు సిఫార్సు చేస్తామన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ఖరీదైన వాహనాలు ఇచ్చి వారి జీవితాలు నాశనం చేయవద్దని సూచించారు.



స్వాధీనపర్చుకున్న ద్విచక్రవాహనాలు

గంజాయి ముఠాకు దేహశుద్ధి

తగరపువలస, న్యూస్‌టుడే: చిట్టివలస శ్మశానవాటిక సమీప మార్గంలో భయపెడుతున్న గంజాయి ముఠాకు స్థానికులు ఆదివారం రాత్రి దేహశుద్ధి చేశారు. ఈ మార్గంలో ప్రయాణించే వారిపై దౌర్జన్యం చేస్తూ, డబ్బులు ఇవ్వాలని అయిదుగురు యువకులు బెదిరిస్తున్నారు. కొందరు ఈ విషయాన్ని స్థానికులకు చెప్పడంతో వారు నిందితుల్లో ఇద్దర్ని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గంజాయి ముఠా దాడిలో గాయపడిన గణేశ్ అనే యువకుడ్ని సమీప ఆస్పత్రికి తరలించారు.

ముగ్గురు యువతుల్ని రక్షించిన గార్డులు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ బీచ్ వద్ద ఆదివారం సముద్ర స్నానం చేస్తుండగా మునిగిపోబోతున్న ముగ్గురు యువతుల్ని జీవీఎంసీ, టూరిజం బ్లూ ఫ్లాగ్ బీచ్ లైఫ్ గార్డులు రక్షించారు. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన ఎనిమిది మంది యువతీ యువకులు విహారయాత్రలో భాగంగా తీరానికి వచ్చారు. ఈ క్రమంలో ఇ.హర్షిత(19), వైష్ణవి (19), శ్రీసాయి (21) అలల్లో చిక్కుకున్న విషయాన్ని గమనించిన గార్డులు సకాలంలో వారిని ఒడ్డుకు చేర్చడంతో ప్రాణాపాయం తప్పింది. పోలీసుల సమక్షంలో వారికి కౌన్సెలింగ్ చేపట్టాక పంపించేశారు.

మహిళ అదృశ్యం

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: బి.ఆదిలక్ష్మి (58) అనే మహిళ అదృశ్యంపై ఆదివారం కేసు నమోదైనట్లు భీమిలి సీఐ బి.సుధాకర్ తెలిపారు. చిప్పాడ దివీస్ కంపెనీలో పని చేస్తున్న ఈమె కుమారుడు గోవిందరావు చిట్టివలస కొత్తపేటలో కుటుంబంతో నివాసముంటున్నారు. ఈనెల రెండోతేదీన ఆదిలక్ష్మి శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం అచ్యుతాపురంలోని సొంతింటికి వెళ్తానని చెప్పడంతో ఆమెను తగరపువలస బస్‌స్టాప్ వద్ద తన ద్విచక్రవాహనంపై దింపి ఇంటికి వచ్చేశారు. అదేరోజు సాయంత్రం స్వగ్రామంలోని వారికి ఫోన్ చేసి తన తల్లి కోసం వాకబు చేయగా రాలేదని చెప్పడంతో అంతటా గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ఆనందపురం, న్యూస్‌టుడే: గొట్టిపల్లి ఉన్నత పాఠశాల 2004-05 పదోతరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. అందరూ అప్పటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు.

పింఛనుదారుల సమావేశం

తగరపువలస, న్యూస్‌టుడే: ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పింఛనుదారుల సమస్యలపై ఆదివారం చిట్టివలస జ్యూటుమిల్లు కల్యాణ మండపంలో సమావేశం జరిగింది. ఈనెల 8న విశాఖలోని మద్రిపాలెం పీఎఫ్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని వక్తలు కోరారు.

తీరంలో చిత్రీకరణ

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భీమిలి బీచ్‌రోడ్డు నేర్లవలస ఎర్రమట్టి దిబ్బలు తీరంలో నాగశౌర్య హీరోగా నటిస్తున్న పోలీసువారి హెచ్చరిక సినిమా షూటింగు ఆదివారం జరిగింది. దర్శకుడు రాజేంద్ర హీరో, ఇతర తారాగణంపై పలు కీలక సన్నివేశాలను చిత్రీకరించారు.

గీతంలో ముగిసిన సమావేశాలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) వేదికగా జరిగిన ఆంధ్రప్రదేశ్ ఫార్మకాలజిస్టుల సొసైటీ జాతీయ సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. ఐక్యూ వీఐఏ సంస్థ ఆసియా ప్రాంత వైద్య సురక్షిత విభాగాధిపతి మేజర్ (విశ్రాంత) డాక్టర్ కాంతి, బీకేరాయ్ రీసెర్చ్ సెంటర్ (కోల్‌కతా)క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రో జ్యోతి బౌమిక్, జిమ్సర్ వైద్య నిపుణులు డాక్టర్ మాధవులు తదితరులు ప్రసంగించారు. జిమ్సర్ ప్రో-వీసీ డాక్టర్ బి.గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

కొమ్మాది, న్యూస్‌టుడే: శిల్పారామం కళావేదికపై ఆదివారం సాయంత్రం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం మైమరపించాయి. నగరానికి చెందిన కిరణ్మయి నృత్యనికేతన్ చిన్నారులు వారి హావభావాలతో నర్తించిన నృత్యాలు సందర్శకులను అలరించాయి.

ప్రసాద్ పథకం పనుల స్థితి గతులపై సమీక్ష

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రసాద్ పథకం పనులపై రాష్ట్ర దేవాదాయశాఖ అదనపు కమిషనర్ (ఏడీసీ) కె.రామచంద్రమోహన్ ఆదివారం సమీక్ష నిర్వహించారు. దేవస్థానం అతిథి గృహంలో జరిగిన కార్యక్రమంలో ఈవో వేంద్ర త్రినాథరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. సింహగిరి బస్‌స్టాండు ఆవరణలో జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణ పురోగతిపై చర్చించారు. బస్‌స్టాండు మధ్యలో బస్‌బే నిర్మాణానికి ఏడీసీ అభ్యంతరం తెలిపారు. ఉత్సవాల సమయంలో తగినంత స్థలం లేకుంటే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో బస్‌బే ఓ మూలన నిర్మించాలని, మిగిలిన పనులు యథావిధిగా కొనసాగించాలని సూచించారు.

రహదారులపై కాంక్రీటు వ్యర్థాలు.. రాకపోకలకు ఇక్కట్లు



పనోరమహిల్స్ నుంచి మధురవాడ వెళ్లే రోడ్డుపై..

మధురవాడ, న్యూస్‌టుడే: మధురవాడ పనోరమహిల్స్ నుంచి మధురవాడ వెళ్లే ప్రధాన రోడ్లపై కాంక్రీటు వ్యర్థాలు పడేస్తుండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఐటీహిల్స్, మారికవలస తదితర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్న కాంక్రీటు మిక్సింగ్ వాహనాల్లోని మిగులు వ్యర్థాలను ఇష్టానుసారం రోడ్లపై వేస్తున్నారు. దీంతో ఇక్కడ రోడ్లన్నీ కాంక్రీటు వ్యర్థాల గుట్టలతో అధ్వానంగా తయారవుతున్నాయి. వీటిని గమనించని వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. రూ.లక్షలు వెచ్చించి అభివృద్ధి చేసిన రోడ్లు ఈ వ్యర్థాల కారణంగా పూర్తిగా దెబ్బతింటున్నాయని పలువురు వాపోతున్నారు. దీనిపై జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి సంబంధిత కాంక్రీటు మిక్సింగ్ పరిశ్రమలు, వాహనాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వదలని 'తుప్పు'

మధురవాడ, న్యూస్‌టుడే: ఎండాడ పనోరమహిల్స్ రోడ్డులోని జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయ ప్రాంగణంలో పలు వాహనాలు తుప్పు పట్టి పోతున్నాయి. కార్యాలయ ప్రాంగణంలోకి అడుగు పెట్టిన వెంటనే ఎటు చూసినా వినియోగానికి దూరమైన వాహనశ్రేణి దర్శనమిస్తోంది. సంబంధిత శాఖలో ఎంతో కాలం వ్యవసాయ పరీక్షలకు వినియోగించిన సంచార ప్రయోగశాల బస్సు కూడా తుప్పు పట్టిపోయింది. ఏళ్ల తరబడి కొన్ని జీపులకు మరమ్మతులు కూడా చేయకుండా విడిచి పెట్టడంతో అవి మట్టిలో కలిసి పోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాహనాలను, వాటి విడి భాగాలను వేలం వేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద ఇలా..



విశాఖ తూర్పు

ముగ్గురు యువతుల్ని రక్షించిన గార్డులు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ బీచ్ వద్ద ఆదివారం సముద్ర స్నానం చేస్తుండగా మునిగిపోతున్న ముగ్గురు యువతుల్ని జీవీఎంసీ, టూరిజం బ్లూ ఫ్లాగ్ బీచ్ లైఫ్ గార్డులు రక్షించారు. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన ఎనిమిది మంది యువతీ యువకులు విహారయాత్రలో భాగంగా తీరానికి వచ్చారు. ఈ క్రమంలో ఇ.హర్షిత(19), వైష్ణవి (19), శ్రీసాయి (21) అలల్లో చిక్కుకున్న విషయాన్ని గమనించిన గార్డులు సకాలంలో వారిని ఒడ్డుకు చేర్చడంతో ప్రాణాపాయం తప్పింది. పోలీసుల సమక్షంలో వారికి కౌన్సెలింగ్ చేపట్టాక పంపించేశారు.

– న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

సమస్య : జాతీయ రహదారి ఇసుకతోట వద్ద ఎంవీపీ సెక్టారు-1 వైపు ప్రహరీ దెబ్బ తింది. – హనుమంతరావు

సమాధానం : పరిశీలించి మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాసరావు, డి.ఈ.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229

సమస్య : ఎంవీపీకాలనీ సెక్టారు-2, 6 ల మధ్య ప్రవహించే గెడ్డను శుభ్రం చేయాలి. – అనూరాధ

సమాధానం : జె.సి.బి. సమకూర్చి, గెడ్డను శుభ్రం చేస్తాం. – సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

■ దుర్గాదేవి వేడుకల్లో జీవీఎల్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: రామ్‌నగర్‌లో వెలసిన శ్రీ దుర్గామల్లేశ్వరి ఆలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక పూజల్లో మాజీ ఎంపీ జి.వి.ఎల్.నరసింహారావు ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు మార్గాన వెంకటేశ్వరరావు జీవీఎల్‌ను సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వరరావు చేపడుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సమాజ సేవలను కొనియాడారు. అనంతరం స్వామివారి ప్రతిమను జీవీఎల్‌కు అందజేసి సన్మానించారు.


మాజీ ఎంపీ జీవీఎల్‌కు వేంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేస్తున్న మార్గాన వెంకటేశ్వరరావు

■ ముగిసిన జిల్లాస్థాయి బాడీ లిఫ్టింగ్ పోటీలు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: కిలాని అప్పలనారాయణ స్మారక జిల్లా స్థాయి బాడీ లిఫ్టింగ్ పోటీలు ఆదివారం సెంట్రల్‌పార్కు వద్ద ముగిశాయి. 50 నుంచి 90 కిలోల విభాగాల్లో ఎన్.మణికంఠ, కె.చరణ్, జి.శ్రీరామమూర్తి, ఎ.అభిషేక్, సిహెచ్.దిలీప్, ఎస్.అనుదీప్, ఎస్.వంశీ, కె.హేమంత్‌సాయి, ఎన్.సురేష్, బి.ఆనందరావులు స్వర్ణ పతకాలు గెలుపొందారు. విజేతలకు పతకాలు, ట్రోఫీలను కదిరి వెంకటమూర్తి, బి.ప్రసాదరావులు అందజేశారు. ముగింపోత్సవంలో ఆంధ్రా బాడీ లిఫ్టింగ్ సంఘం అధ్యక్షుడు ఎస్.శివశంకర్, జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.మధు, బి.కోటిరెడ్డి, టోర్నీ నిర్వాహకులు వాయుపుత్ర హెల్త్‌క్లబ్ డైరెక్టర్ కిలాని గణేష్, జిల్లా సంఘం సంయుక్త కార్యదర్శులు అఖిలేష్, ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

■ మానవ హక్కులపై అవగాహన

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: సామాన్యుడికి మరింత చేరువలో చట్టాలు ఉన్నాయని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. డాబాగార్డెన్స్ సమీప అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో ఏ స్టేషన్ పరిధిలో నేరం జరిగితే అదే స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉండేదన్నారు. ప్రస్తుతం వెసులబాటు కల్పించారన్నారు. ఈ సందర్భంగా మానవ హక్కులపై వివరించారు. సీనియర్ న్యాయవాది లక్ష్మీ రాంబాబు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఎస్.వి.రమణ, గుండు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు

■ వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం: సింహగిరిపై ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు. * శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అప్పన్న ఆలయంలో అమ్మవార్ల తిరువీధి వేడుకగా జరిగింది. ఉదయం ఆలయ హంస మూలన పండితులు శ్రీమద్రామాయణం పారాయణం చేశారు.

■ ప్రకాశం జిల్లావాసి అదృశ్యం



పెదవాల్తేరు, న్యూస్‌టుడే: మానసిక వైద్యం కోసం వచ్చిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం అదృశ్యమయ్యాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా అంబేడ్కర్ కాలనీకి చెందిన **పులి వెంకట సంజయ్‌కుమార్** (22) మానసిక పరిస్థితి బాగోలేక గత నెల 29న విశాఖలోని ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలో చేర్పించారు. తన తండ్రితో కలిసి మధ్యాహ్నం భోజనం చేసి ఆసుపత్రి ఆవరణలో ఇద్దరూ కూర్చున్నారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో అదృశ్యమయ్యాడు. తండ్రి పులి సింగయ్య ఫిర్యాదు మేరకు సి.ఐ రమణయ్య ఆధ్వర్యంలో హెచ్.సి చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన వ్యక్తి ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చదువుతున్నట్లు తెలిపారు.

'యాత్రి' పర్యాటకులు ఎదురు చూపులు
ఎప్పుడు పూర్తయ్యేనో...!

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

పర్యాటకులు విశాఖలో బస చేసేందుకు అమితంగా ఆసక్తి చూపే వాటిలో యాత్రి నివాస్ ఒకటి. అయితే దీని ఆధునికీకరణ పనులు ఏడాది నుంచి నత్తనడకన సాగుతూనే ఉన్నాయి. నిధుల విడుదల విషయంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఇది ఎప్పటికి అందుబాటులోకి వస్తుందో తెలియని పరిస్థితి. గత వైకాపా పాలనలో తీసుకున్న అడ్డగోలు నిర్ణయాలతో ఈ దుస్థితి నెలకొందని పలువురు విమర్శిస్తున్నారు.


యాత్రి నివాస్ భవనం

అత్యాధునిక వసతులు పేరిట...

నగరానికి విచ్చేసే పర్యాటకులు, సందర్శకులు పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన భవనాల్లోనే బస చేస్తుంటారు. వీటిలో ప్రధానమైంది అప్పుఘర్ దరి యాత్రి నివాస్. చాలా కాలంగా పర్యాటకులకు సేవలందిస్తున్న ఈ భవనం సముద్ర తీరానికి అభిముఖంగా ఉంటుంది.


సగంలోనే లిఫ్ట్ పనులు

★ పశ్చిమబెంగాల్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఇది అనువుగా ఉండటంతో అత్యధికులు ఇక్కడే ఉండేందుకు ఆసక్తి చూపేవారు. పర్యాటకులు ఇక్కడ నుంచే తాము చూడాల్సిన ఇతర సందర్శనీయ ప్రాంతాలకు వెళ్లేవారు. దీంతో ఇక్కడ నిత్యం సందర్శకులతో కళకళలాడేది.

★ ఈ ఏడాది మే, ఆగస్టు నాటికి పూర్తవ్వాల్సి ఉండగా.. ప్రస్తుతం 70 శాతం పనులు మాత్రమే జరిగాయి. గత వైకాపా పాలనలో అధికారులు, ప్రజాప్రతినిధులు అడ్డగోలుగా నిర్ణయాలు తీసుకుని అంచనాలు పెంచేశారు. మరిన్ని సదుపాయాలు కల్పించాలంటూ ఆదేశాలు జారీ చేయటంతో అనుకున్న దాని కంటే బడ్జెట్ పెరిగిపోయింది. దీంతో గుత్తేదారుడు మరిన్ని నిధులు కేటాయించాలని అధికారులకు ప్రతిపాదించడంతో నిధుల విడుదలలో సమస్య తలెత్తింది. ఎలాంటి వర్క్ ఆర్డర్లు లేకుండా అంచనాలు పెంచటంతో ప్రస్తుత అధికారులు విస్మయం వ్యక్తం చేసినట్లు సమాచారం.

★ గత వైకాపా ప్రభుత్వ హయాంలో విశాఖకు రాజధాని వస్తే ఉన్నతాధికారులు ఉండేందుకు అనువైన భవనంగా యాత్రి నివాస్ ఉంటుందని భావించారు. దీంతో గత ఏడాది రూ.8.6 కోట్లతో దీన్ని ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. భవనాన్ని పడగొట్టకుండా ఉన్నంతలోనే గదులు, వంటశాల, ఇతరత్రా సదుపాయాలతో సందర్శకులను ఆకర్షించేలా పనులు చేపట్టారు.

★ ఈ తరహా సమస్యతో దసరా సీజన్‌లో నగరానికి వచ్చే సందర్శకులు, పర్యాటకులకు నిరాశే ఎదురైంది. ఇది ఎప్పటికి పూర్తవుతుందో కూడా స్పష్టత లేదు. తద్వారా పర్యాటకశాఖకు వచ్చే ఆదాయానికి కూడా గండి పడుతుందనే చెప్పాలి.


నిర్మాణ దశలో కింది అంతస్తు

ప్రమాదాల నియంత్రణకు కృషి
అర్ధరాత్రి దాటాక పోలీసుల విస్తృత తనిఖీలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదాలను నియంత్రించేందుకు విశాఖ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, ఏసీడీపీ (ట్రాఫిక్) ప్రవీణ్‌కుమార్ ఆదేశాలతో రోజూ అర్ధరాత్రి దాటాక విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు.

ప్రధానంగా నిద్ర, మద్యం మత్తులో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉండటంతో ముఖ్యంగా వాటిపైనే దృష్టి కేంద్రీకరించారు.

★ నగరంలోకి ప్రవేశించిన భారీ వాహనాలను ఆపి డ్రైవర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్నారు. ఆ తర్వాత వారికి మంచినీరు ఇచ్చి ముఖంపై నీటిని జల్లుకోవాలని సూచిస్తున్నారు. తద్వారా నిద్ర మత్తును పోగొడుతున్నారు.

★ డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు విస్తృతంగా జరుపుతున్నారు. నిర్మానుష్య ప్రాంతాల్లో వాహనాలు అతి వేగంతో నడిపే అవకాశాలున్నందున ఆయా ప్రాంతాల్లో ఉంటూ వాహనాల తనిఖీ చేసి రేస్‌లు నియంత్రిస్తున్నారు. ప్రమాదాల నియంత్రణకు ఈ తరహా నిబంధనలు కొంత వరకు దోహదపడతాయని భావిస్తున్నారు.


డ్రైవర్‌తో ముఖం కడిగిస్తున్న పోలీసులు

'దేవి వైభవం' ప్రవచనాలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పని చేయడం మన విధి.. ఫలితం దైవానికి వదిలేయాలని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నితాయి సేవిని మాతాజీ అన్నారు. సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం రోటరీ క్లబ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో 'దేవి వైభవం' పేరిట ప్రవచనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాతాజీ మాట్లాడుతూ భగవంతున్ని నిరంతరం ఆరాధించడం ద్వారా మనసులో మంచి ఆలోచనలు వస్తాయని తెలిపారు. సంప్రదాయాలను కొనసాగించడం నేటి సమాజంలో ముఖ్యమన్నారు. రోటరీ క్లబ్ విశాఖపట్నం ప్రోగ్రాం ఛైర్మన్ జగన్‌మోహన్, ప్రెసిడెంట్ వినయ్ గాంధీ, కార్యదర్శి మణిమాల, కోశాధికారి ఎం.కె.కుమారి పాల్గొన్నారు.


జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తున్న నితాయి సేవిని మాతాజీ

కృత్రిమ గర్భాధారణపై సదస్సు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: కృత్రిమ గర్భాధారణలో నూతన పద్ధతులు, పిల్లలు కలగడంలో ఆలస్యమైన దంపతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్ జతిన్‌షా వివరించారు. సిరిపురం ఓ హోటల్లో ఆదివారం ఉదయం ప్రసూతి వైద్యుల సొసైటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ జతిన్‌షా (ముంబయి) సంతాన లేమి దంపతులకు కొత్త కొత్త విధానాలపై అవగాహన కల్పించారు. సంతాన లేమి దంపతుల కోసం నూతన విధానాలు ఏ విధంగా ఉపయోగించాలనే విషయంపై వివరించారు. డాక్టర్ రవిరాజు జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభించారు. వైద్యులు శశిప్రభ, సుబ్బరాజు, మురళీకృష్ణ, పద్మావతి, వివిధ ప్రాంతాల నుంచి సుమారు మూడు వందల మంది వైద్యులు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగిస్తున్న డాక్టర్ రవిరాజు, డాక్టర్ శశిప్రభ, తదితరులు

ఎన్‌సీసీతో ప్రయోజనాలెన్నో..

సాగర్‌నగర్, ఎండాడ, న్యూస్‌టుడే: దేశసేవలో ఎన్‌సీసీ కీలక పాత్ర వహిస్తుందని 13 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాంప్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్‌కుమార్ అన్నారు. రుషికొండ గాయత్రీ విద్యా పరిషత్ (జీవీపీ) డిగ్రీ అండ్ పీజీ కోర్సుల కళాశాల వేదికగా ఆదివారం నుంచి చేపట్టిన ఉత్తరాంధ్ర జిల్లాల ఎన్‌సీసీ (నేవీ, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్) క్యాడెట్ల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎన్‌సీసీ ద్వారా లభించే ప్రయోజనాలను వివరించారు. ఈనెల 14వ తేదీ వరకు ఈ శిక్షణ కొనసాగుతుందని జీవీపీ ఎన్‌సీసీ విభాగాధికారి కెప్టెన్ ఆర్.బి. అనంతరావు పేర్కొన్నారు. కెప్టెన్ ఉమానాగేశ్వరి, సుబేదార్ మేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎన్‌సీసీ క్యాంప్ కమాండింగ్ ఆఫీసర్ నీరజ్‌కుమార్

వాకర్స్ క్యాబినెట్ కౌన్సిల్ సమావేశం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా 101 గవర్నర్ కె.రంగారావు అధ్యక్షతన ఆదివారం క్యాబినెట్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఎంవీపీకాలనీ ఎ.ఎ.ఎ.ఎం. కళాశాలలో జరిగిన సమావేశంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఉద్యమంలో స్ఫూర్తివంతమైన కీలక పాత్ర పోషిస్తున్న సంస్థ సేవకులు వాకర్స్ ఇంటర్నేషనల్ పీఆర్‌ఓ కమల్ బెయిద్‌సేవలను కొనియాడుతూ సంస్థ ప్రతినిధులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆర్.సత్యానందం, నందూరి రామకృష్ణ, ఉప్పలపాటి శుభ, ద్వారకానాథ్, నరసింహారావు, అప్పారావు, వెంకటరాజు, నాగార్జున, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు. వాకర్స్ క్లబ్ ప్రతినిధులకు పర్యావరణహితార్థం నార సంచులు కమల్ బెయిద్ అందించారు.


కమల్ బెయిద్‌ను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: 21వ వార్డు చినవాల్తేరులో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం ఉదయం నిర్వహించారు. భాజపా వార్డు వైస్ ప్రెసిడెంట్ కోన సూరిబాబు ఆధ్వర్యంలో పలువురిని సభ్యులుగా చేర్చుకున్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సభ్యత్వంపై అవగాహన కల్పించారు. భాజపా నాయకులు మహమ్మద్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: అక్కయ్యపాలేనికి చెందిన స్నేహ బృందం ఆదివారం ముడసర్లోవ పార్కులో అపూర్వకలయిక నిర్వహించారు. వీరు వాట్సాప్‌గ్రూప్ ద్వారా ప్రతి ఏటా కలుస్తూ ఉంటారు. వివిధ ప్రాంతాల్లో ఉంటూ దసరా ఉత్సవాల సందర్భంగా ఈ కలయిక ఉంటుందని తెలిపారు. చంద్రశేఖర్, సురేష్, దుర్గాప్రసాద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో మారథాన్

మధురవాడ, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులో సాగరతీర ద్వారం వద్ద 'వైజాగ్ ట్రయిల్ రన్' ఆధ్వర్యంలో మూడో ఎడిషన్‌లో భాగంగా వైజాగ్ జూ మారథాన్ పేరుతో ఆదివారం నిర్వహించిన పోటీల్లో పలువురు ఔత్సాహికులు పాల్గొన్నారు. సంబంధిత ద్వారం నుంచి రుషికొండ వైపు 3కె, 5కె, 10కె, 21కె పేరిట నాలుగు విభాగాలుగా ఈ పోటీలు నిర్వహించారు. సుమారు 1300 మంది పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు సంబంధిత పోటీల డైరెక్టర్ డాక్టర్ కృష్ణ చైతన్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు యోగేష్, ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు


పెదవాల్తేరు, న్యూస్‌టుడే: గురజాడ కళాక్షేత్రంలో విద్యార్థులకు ఆదివారం పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. రోటరీ క్లబ్ విశాఖపట్నం, కె.ఎస్.గుప్తా మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రామాయణ, మహాభారత ఇతిహాసాలకు సంబంధించి వివిధ రకాల చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సింబయాసిస్ టెక్నాలజీ అధినేత ఓ.నరేష్‌కుమార్ సౌజన్యంతో వీటిని ఏర్పాటు చేశారు. సుమారు 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.




కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు


సెక్టారు-6లో..


లలితాదేవిగా విజయదుర్గ అమ్మవారు


అన్నపూర్ణాదేవిగా రాజరాజేశ్వరి అమ్మవారు


తోటగరువులో..


ఎంవీపీ క్యాన్సర్‌ఆసుపత్రి కూడలిలో..

లలితా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారి దర్శనం

శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తూర్పు నియోజకవర్గంలోని పలు దేవాలయాలు, మండపాల కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారు లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. జగన్మాతకు మహిళలు సామూహిక కుంకుమార్చనలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, ఎం.వి.పి.కాలనీ, పెదవాల్తేరు, విశాలాక్షినగర్


ఎర్ని దుర్గ మాంబ ఆలయంలో..


శివాజీపాలెం విఘ్నేశ్వర యంగ్ స్టార్స్ ఆధ్వర్యంలో..


హనుమంతువాక విజయ దుర్గమ్మ ఆలయంలో..


భద్రం సామాజిక భవనంలో..

ప్రసాద్ పథకం పనుల స్థితి గతులపై సమీక్ష

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రసాద్ పథకం పనులపై రాష్ట్ర దేవాదాయశాఖ అదనపు కమిషనర్ (ఏడీసీ) కె.రామచంద్రమోహన్ ఆదివారం సమీక్ష నిర్వహించారు. సింహగిరిపై దేవస్థానం అతిథి గృహంలో జరిగిన కార్యక్రమంలో ఈవో వేండ్ర త్రినాథరావు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, పర్యాటక శాఖ ఏఈ మదన్‌మోహన్ పాల్గొన్నారు. సింహగిరి బస్‌స్టాండు ఆవరణలో జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణ పురోగతిపై చర్చించారు. బస్‌స్టాండు మధ్యలో బస్‌బే నిర్మాణానికి ఏడీసీ అభ్యంతరం తెలిపారు. ఉత్సవాల సమయంలో తగినంత స్థలం లేకుంటే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో బస్‌బే ఓ మూలన నిర్మించాలని, మిగిలిన పనులు యథావిధిగా కొనసాగించాలని సూచించారు.


పర్యాటకశాఖ అధికారులతో చర్చిస్తున్న ఏడీసీ రామచంద్రమోహన్

సర్వేయర్ల రాష్ట్ర స్థాయి కౌన్సిల్ సమావేశం

విశాఖలోని సిరిపురం బాలల ప్రాంగణంలో ఆదివారం ఉదయం ఏపీ సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా జ్యోతి వెలిగించి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వే విధానాలపై చర్చించారు. అధికం సంఖ్యలో సంఘం సభ్యులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పెదవాల్తేరు



సమస్యలు పరిష్కరించాలని వినతి

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు–3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కార్మికుల్ని అన్ని విధాలుగా భయభ్రాంతులకు గురి చేస్తున్న ఉక్కు యాజమాన్యంతో చర్చించి, వివిధ సమస్యలు పరిష్కరించాలని ఉక్కు పోరాట కమిటీ నాయకులు కోరారు. ఆదివారం వారు తెదేపా రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి వినతులు అందించారు. ఇంటి అద్దె చెల్లించాలని, విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని కోరుతూ.. ఈడీ(వర్క్స్) కార్యాలయం వద్ద సుమారు 24 గంటల పాటు నిరసన తెలియజేసినా, ఓ మహిళా ఉద్యోగి అస్వస్థతకు గురైనా అధికారులు స్పందించలేదని వివరించారు. సకాలంలో వేతనాలు అందక యువ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యలపై ఎంపీ శ్రీభరత్‌తో కలిసి ఉక్కు సీఎండీ ఎ.కె. సక్సేనాతో చర్చించేందుకు చొరవ చూపాలని పల్లాను కోరారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, పి.వి.రమణమూర్తి, జి.నరేంద్రకుమార్, ఎన్.సింహాద్రి, డి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లాకు సమస్య వివరిస్తున్న ఉక్కు నాయకులు

ఓవరాల్ ఛాంపియన్ విశాఖ

శ్యామలాసెంటర్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను విశాఖపట్నం కైవసం చేసుకుంది. వరుసగా బాలురు, బాలికల ఛాంపియన్‌షిప్‌ను కూడా కైవసం చేసుకొని అన్నింటా విజయ కేతనం ఎగురవేసింది. వ్యక్తిగత బాలుర విభాగంలో దుడ్డు శేషు (విశాఖ), ఎస్‌కే రోషన్ (గుంటూరు) కైవసం చేసుకోగా.. బాలికల విభాగంలో ఎల్.డింపుల్‌మహశ్రీ (ఏలూరు), బాకి శైలజ (విశాఖ), పి.వసంత (విజయనగరం) కైవసం చేసుకున్నారు.


ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన విశాఖజట్టు క్రీడాకారులు

అర్ధరాత్రి సీపీ ఆకస్మిక తనిఖీ

ఎండాడ, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై పగలు, రాత్రి ప్రమాదాల నివారణతో పాటు ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు అవసరమైన చర్యల విషయంలో ట్రాఫిక్ పోలీసులు చురుగ్గా వ్యవహరించాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సిబ్బందికి బాధ్యతలు గుర్తు చేశారు. ఎండాడ కూడలిలోని ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయాన్ని శనివారం అర్ధరాత్రి ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా కార్యాలయ పరిధిలోని అన్ని స్టేషన్లకు సంబంధించిన కేసుల దస్త్రాలను పరిశీలించి వాటి స్థితిగతులపై ఆరా తీశారు. ఎలాంటి కేసులైనా సుదీర్ఘకాలం పెండింగ్‌లో లేకుండా చూడాలని ఏసీపీని ఆదేశించారు. జాతీయ రహదారిపై పలు కూడళ్లను ఎప్పటికప్పుడు పరిశీలించి సూచికల వ్యవస్థ నిర్విరామంగా పని చేసేలా చూడాలన్నారు. కొన్ని చోట్ల సెంట్రల్ లైటింగ్ దీపాలు పని చేయడంలేదని, సంబంధిత విభాగాధికారులతో మాట్లాడి ఆ సమస్య పరిష్కారమయ్యేలా చూడాలన్నారు.


ఎండాడ ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయంలో దస్త్రాలు పరిశీలిస్తున్న సీపీ

విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

8న రజతోత్సవం

అల్లిపురం, న్యూస్‌టుడే: నగరంలోని అల్లిపురం సమీప చలువతోట పరిశుద్ధ జపమాల రాజ్ఞీ దేవాలయ రజతోత్సవం ఈనెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు దేవాలయం విచారణకర్తలు ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్ పేర్కొన్నారు. 8వతేదీన సాయంత్రం 4గంటలకు జపమాల రాజ్ఞీ స్వరూపతేరుతో పురప్రదక్షిణ, ఫాదర్ వర్గీస్ చాపరత్‌చే దివ్యబలిపూజ జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఫాదర్ యజ్జల మరియరత్నం మహోత్సవ పతాకాన్ని ఆవిష్కరించి, త్రిదిన ప్రార్థనలు చేపట్టారు.

నియోజకవర్గంలో 'ఈనాడు'

జ్ఞానాపురం, న్యూస్‌టుడే: రెల్లి, రెల్లి ఉపకులాలకు 5శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉదయం 9 గంటలకు డాబాగార్డెన్స్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు విశాఖ జిల్లా రెల్లి సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ.

దివ్యాంగుల ఆశ్రమానికి మలయాళీ కౌన్సిల్ వితరణ

మురళీనగర్, న్యూస్‌టుడే : సామాజిక సేవల్లో భాగంగా వరల్డ్ మలయాళీ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ చాప్టర్ విభాగం సభ్యులు మాధవధారలో ఉన్న కేర్ అండ్ లవ్ దివ్యాంగుల ఆశ్రమానికి విరాళం అందజేశారు. కౌన్సిల్ సభ్యులు పి.మోహన్‌దాసు వితరణతో 25వేల రూపాయలు విలువ చేసే వీల్‌ఛైర్‌ను, కళాతిల్ వేణుగోపాలన్ నాయర్ ఇచ్చిన రూ.20వేల నగదును ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో డబ్ల్యూఎంసి ఛైర్మన్ వేణుగోపాలన్ నాయర్, అధ్యక్షులు ఎస్.జి.విజయకుమార్, పి.మోహన్‌దాస్, హసన్‌కుట్టి, మహిళలు, 15మంది సభ్యులు హాజరైనట్లు డబ్ల్యూఎంసి ఏపీ చాప్టర్ జనరల్ సెక్రటరీ జార్జ్‌థామస్ తెలియజేశారు.



వీల్‌ఛైర్‌ను అందజేస్తున్న మలయాళీలు

సత్ప్రవర్తనతో మెలగాలి

గురుద్వారా, న్యూస్‌టుడే: సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని నాల్గవ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ రౌడీషీటర్లకు సూచించారు. ఆదివారం ఉదయం స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చెడు వ్యసనాలకు బానిసై నేరాల బాట పడితే జీవితం నాశనమౌతుందని సూచించారు. నిత్యం నిఘా ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకొని మెలగాలన్నారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా ఉపేక్షించేది లేదని తెలిపారు. గొడవల్లో తలదూరిస్తే దాని పర్యవసానం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. ఎస్.ఐ వెంకట్రావ్ పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ విజయ్‌కుమార్, ఎస్.ఐ వెంకట్రావ్

రైల్వేస్టేషన్ ప్రాంగణంలో తనిఖీలు

గురుద్వారా, న్యూస్‌టుడే: గంజాయి రవాణాను అరికట్టడంలో భాగంగా నాలుగో పట్టణ పోలీసులు రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. నార్త్ సహాయక కమిషనర్ లక్ష్మణమూర్తి సిబ్బందితో కలిసి స్టేషన్ ప్రాంగణంలో ప్రయాణికుల సామగ్రిని తనిఖీ చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి గంజాయితో వస్తుంటారని, అలాంటి వారిని పట్టుకునేందుకు ఈ విధంగా చేస్తున్నామని తెలిపారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, ఎస్.ఐలు పాల్గొన్నారు.



ప్రయాణికుల సామగ్రిని తనిఖీ చేస్తున్న ఏసీపీ లక్ష్మణమూర్తి, సీఐ విజయ్‌కుమార్

మానవ హక్కులపై అవగాహన

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: సామాన్యుడికి మరింత చేరువలో చట్టాలు ఉన్నాయని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. డాబాగార్డెన్స్ సమీప అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో ఏ స్టేషన్ పరిధిలో నేరం జరిగితే అదే స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉండేదన్నారు. ప్రస్తుతం వెసులబాటు కల్పించారన్నారు. ఈ సందర్భంగా మానవ హక్కులపై వివరించారు. సీనియర్ న్యాయవాది లక్ష్మీ రాంబాబు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఎస్.వి.రమణ, గుండు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న శ్యాంప్రసాద్

తిరుమల వేంకటేశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కలియుగ దైవం తిరుమలలోని వేంకటేశ్వరుడిని దక్షిణం జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పద్మజ దంపతులు ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ సమయంలో స్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.



శ్రీవారి ఆలయం ఎదుట ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు

అధ్వానంగా గెడ్డలు

ఫోకస్

గురుద్వారా, న్యూస్‌టుడే

ఉత్తర నియోజకవర్గం 14, 24వ వార్డుల్లో గెడ్డలు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లేఅవుట్, నార్త్ఎక్స్‌టెన్షన్, గాంధీనగర్ ప్రాంతాల్లో గెడ్డలు ఏళ్ల కాలంగా మరమ్మతులకు నోచుకోని దుస్థితి. ఓ చోట గెడ్డ రక్షణ గోడ కొట్టుకుపోయి, మరో చోట గట్టు పూర్తిగా దెబ్బతిని, ఇంకో ప్రాంతంలో అడుగు భాగం విరిగిపోయి దర్శనమిస్తున్నాయి. వరదలకు మురుగు సక్రమంగా పారకుండా బయటకు పొంగిపోయి రహదారుల పైకి ప్రవహిస్తోంది. చిన్నపాటి వర్షానికే మురుగు ఇళ్ల ముందుకు చేరడంతో స్థానికులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇంత దారుణంగా ఉన్నా పరిష్కార మార్గం కానరావడం లేదు. బాగున్నవాటికే మళ్లీ మరమ్మతులు చేస్తున్నారే తప్ప. ఇలాంటి వాటిని పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.



మరమ్మతులకు గురైన బాలఏసు చర్చికి ఆనుకొని ఉన్న గెడ్డ



గాంధీనగర్ అభయాంజనేయ స్వామి ఆలయం వెనుక దెబ్బతిన్న గెడ్డ



సీతమ్మధార సాయిబాబా మందిరం దరి కొట్టుకుపోయిన గెడ్డ

పోర్టు హాస్పిటల్‌ను సొంత నిధులతో అభివృద్ధి చేయాలి

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే : విశాఖ పోర్టు హాస్పిటల్‌ను పి.పి.పి. పద్ధతిలో ప్రయివేట్ వ్యక్తులకు ఇవ్వాలనే నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కె. సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణను నిలిపివేయాలని కోరుతూ సాలగ్రామపురం పోర్టు హాస్పిటల్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో గత ఆరు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న కార్మికులకు మద్దతుగా ఆదివారం ఆయన దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో విశాఖ పోర్టును నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే పోర్టు ఆసుపత్రిని ప్రయివేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపించారు. ఇప్పటికే దీనిపై పోర్టు యాజమాన్యం టెండర్లు పిలిచిందని, దీనిని మనం కాపాడుకోవాలని ఆయన కార్మికులు, విశాఖ ప్రజలకు పిలుపునిచ్చారు. పోర్టు తన సొంత నిధులతోనే పోర్టు హాస్పిటల్‌ను అభివృద్ధి చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె.సత్యనారాయణ, త్రినాథ్, శంకరరావు, జె.డి.లక్ష్మి, నర్సింగరావు, ఈశ్వరరావు, నాయుడు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న యూనియన్ నాయకులు

పచ్చదనంపై వేటు

కంచరపాలెం, న్యూస్‌టుడే

పచ్చదనం మనిషికి జీవనాధారం. మొక్కలు నాటండంటూ ప్రభుత్వాలు ప్రచారం చేస్తుంటే.. ఉన్న మొక్కలను నరికేయడం ఇటీవల కాలంలో ఎక్కువైంది. విద్యుత్తు సిబ్బంది తమ లైన్లకు అడ్డొచ్చిన ప్రతీ చెట్టుకూ గుండు కొట్టినట్లుగా కొమ్మలు నరుక్కుంటూ పోతారు. ఇది నగరవాసులకు అలవాటైన వ్యవహారం. దీన్ని ఆసరాగా చేసుకుని ఆయా ప్రాంతాల్లోని వ్యాపార వర్గాలు మొక్కలు, చెట్ల మిగతా భాగాల్ని వారి ఇష్టానుసారం నరికేస్తున్నారు. తమ దుకాణానికి అడ్డుగా ఉన్నాయని, పార్కింగ్ కోసమని.. ఇలా సవాలక్ష కారణాలతో పచ్చదనంపై గొడ్డలి వేటు వేస్తున్నారు. నగరంలోని ప్రధాన రహదార్లలో ఈ విచక్షణా రహిత పనులు జరుగుతూనే ఉన్నాయి. కంచరపాలెం మెట్టు నుంచి ఊర్వశి కూడలి వరకు రోడ్డుకిరువైపులా మొక్క అనేది లేదు. మెట్టు అమ్మవారి గుడి ఎదురుగా ఉన్న నాలుగు మొక్కల కొమ్మల్ని ఇటీవల విద్యుత్తు సిబ్బంది నరికేశారు. ఇదే అదనుగా వాటిని కాండం వరకు నరికేశారు స్థానిక దుకాణ నిర్వాహకులు. దీంతో నిలువ నీడకూడా లేకుండా పోయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొక్కలు నాటడం చేతకాదు కానీ, ఉన్న మొక్కల్ని కాపాడుకోకుండా స్వార్థంతో ఇష్టానుసారంగా నరికేసుకుంటూ పోతే నగరంలో పచ్చదనమనేదే కనిపించదు. నగర పాలక సంస్థ ఈవిషయంలో చొరవ చూపి పచ్చదనం పెంపుదల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు.



తీగలకు అడ్డొస్తున్నాయని కొమ్మల నరికివేత





పూర్తిగా నరికేయడంతో మిగిలిన చెట్ల మొదళ్లు

జ్ఞానాపురం, న్యూస్‌టుడే

సమస్య: జీవీఎంసీ 44వ వార్డు బీఆర్‌టీఎస్ రహదారిపై కొన్ని విద్యుత్తు దీపాలు, జీవీఎంసీ జోన్-5 కార్యాలయానికి వెళ్లే మార్గంలోని వీధి దీపాలు వెలగడం లేదు.
-పిల్లి గోవిందరాజు, జ్ఞానాపురం

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
విశాఖ ఉత్తరం: 80747 24699
విశాఖ దక్షిణం: 80085 66543

సమాధానం: సంబంధిత సిబ్బందితో విద్యుత్తు దీపాలు వెలిగేలా చర్యలు చేపడతాం.
- సతీష్, జీవీఎంసీ ఎలక్ట్రికల్ ఏఈ

చకచకా స్పీడు బ్రేకర్ల ఏర్పాటు

కంచరపాలెం, న్యూస్‌టుడే: వాహనాల వేగాన్ని నిరోధించేందుకు అనువుగా స్పీడు బ్రేకర్లను చకచకా ఏర్పాటు చేస్తున్నారు. గతంలో వైకాపా ప్రభుత్వం హయాంలో వేసిన ప్లాస్టిక్ బోల్టులతో కూడిన బ్రేకర్లను తొలగించి వాటిస్థానే సిమెంటుతో కూడిన బ్రేకర్లు వేస్తున్నారు. వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు బ్రేకర్ల ఏర్పాటులో తీసుకుంటున్నారు. కంచరపాలెం మెట్టు, శ్రీముత్యమాంబ అమ్మవారి దేవాలయం ఎదురుగా, ఊర్వశికూడలి, బర్మాకూడలి, ఇండస్ట్రియల్ ఎస్టేట్, మర్రిపాలెం, కరాసా తదితర ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు.



మెట్టు వద్ద వేసిన స్పీడు బ్రేకరు



ఊర్వశి కూడలి వద్ద...

నేడు ఫిర్యాదుల స్వీకరణ

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించేలా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ గొల్లగాని హరి వెంకట కుమారి తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి జోనల్, ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, అనధికార నిర్మాణాలు, టిడ్కో గృహాల కేటాయింపు తదితర అంశాలపై ప్రధాన కార్యాలయంలో తనతోపాటు, కమిషనర్, ఇతర అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. జోనల్ కార్యాలయాల్లో జేసీలకు ప్రజలు విన్నవించవచ్చని తెలియజేశారు.

ఉచిత షుగర్ చెకప్ క్యాంప్

సీతంపేట, న్యూస్‌టుడే: 25వ వార్డు జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఉచిత బీపీ, షుగర్ చెక్ అప్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో 25వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షులు కురెళ్ల సూర్యప్రకాశ్, వైస్ ప్రెసిడెంట్ బందం అప్పారావు పాల్గొన్నారు.

జీవితాలపై సినిమాల ప్రభావం

సీతంపేట, న్యూస్‌టుడే: సినిమా మాధ్యమం వ్యక్తుల జీవితాల్ని ప్రభావితం చేస్తాయని రచయిత ఎస్వీ రామారావు అన్నారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్లో ఆదివారం వైజాగ్ ఫిల్మ్ సొసైటీ(వి.ఎఫ్.ఎస్) వార్షిక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉంటాయన్నారు. సినిమాల ప్రభావం తప్పక ఉంటుందన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అనేక విజయవంతమైన సేవలు అందిస్తోందని కితాబిచ్చారు. సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ 2003లో వి.ఎఫ్.ఎస్. ప్రారంభించామని 21 సంవత్సరాలుగా అనేక ఫిలిం ఫెస్టివల్, ప్రముఖ దర్శకులతో ముఖాముఖి, గొప్ప సినిమాల ఆదరణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. వార్షిక బడ్జెట్‌ని ప్రవేశ పెట్టారు. కార్యక్రమంలో సొసైటీ సంయుక్త కార్యదర్శి బి.చిన్నారావు, ఉపాధ్యక్షులు ఎ.కాశీ విశ్వేశ్వరరావు, కోశాధికారి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. సొసైటీ తరఫున ముఖ్య అతిథిని సత్కరించారు.



ఎస్వీ రామారావును సత్కరిస్తున్న వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సభ్యులు

ముగిసిన జిల్లాస్థాయి బాడీ లిఫ్టింగ్ పోటీలు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: కిలాని అప్పలనారాయణ స్మారక జిల్లా స్థాయి బాడీ లిఫ్టింగ్ పోటీలు ఆదివారం సెంట్రల్‌పార్కు వద్ద ముగిశాయి. 50 నుంచి 90 కిలోల విభాగాల్లో ఎన్.మణికంఠ, కె.చరణ్, జి.శ్రీరామూర్తి, ఎ.అభిషేక్, సిహెచ్.దిలీప్, ఎస్.అనుదీప్, ఎస్.వంశీ, కె.హేమంత్‌సాయి, ఎన్.సురేష్, బి.ఆనందరావులు స్వర్ణ పతకాలు గెలుపొందారు. విజేతలకు పతకాలు, ట్రోఫీలను కదిరి వెంకటమూర్తి, బి.ప్రసాదరావులు అందజేశారు. ముగింపోత్సవంలో ఆంధ్రా బాడీ లిఫ్టింగ్ సంఘం అధ్యక్షుడు ఎస్.శివశంకర్, జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.మధు, బి.కోటిరెడ్డి, టోర్నీ నిర్వాహకులు వాయుపుత్ర హెల్త్‌జిమ్ డైరెక్టరు కిలాని గణేష్, జిల్లా సంఘం సంయుక్త కార్యదర్శులు అఖిలేష్, ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీలు అందజేసిన వెంకటమూర్తి, ప్రసాదరావు తదితరులు

లలితా త్రిపుర సుందరి అలంకరణలో..

సీతంపేట, న్యూస్‌టుడే : 25వ వార్డు సీతంపేటలోని శ్రీ పార్వతీశ్వర ఆలయంలో శరన్నవరాత్రులు నాల్గవ రోజు అమ్మవారు లలితా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకొని అమ్మవారి దర్శనం చేసుకొని పూజలు నిర్వహించారు. పూజారి భాస్కర శర్మ మహిళా భక్తుల చేత కుంకుమ పూజలు చేయించారు.



సీతంపేట శ్రీపార్వతీశ్వరాలయంలో లలిత త్రిపుర సుందరి అలంకరణలో..

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: రామకృష్ణానగర్‌లోని శివాలయం కమిటీ కుర్రోళ్ల ఆధ్వర్యంలో దుర్గాదేవి నవ రాత్రి మహోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి దీపారాధన నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ పోతు నాగమణి, సత్యనారాయణ దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కొత్తూరు శ్రీనివాసరావు, కాళ్ల ప్రకాష్, పాండవ ఈశ్వరరావు, పాండవ శ్రీనివాసరావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దైవ సన్నిధిలో కూచిపూడి నృత్యం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: నరసింహనగర్ శివారు గణేష్‌నగర్‌లోని త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో శరన్నవరాత్రుల్లో భాగంగా ఆదివారం సాయంత్రం మయూరి నృత్య నికేతన్ సంస్థ నాట్యాచార్యులు ఉషారాణి, మురళీమోహన్ ఆధ్వర్యంలో 10మంది చిన్నారులు కూచిపూడి నృత్యం చేశారు. ఆ చిన్నారుల్ని టి.ఎస్.ఎన్.మూర్తి, కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.ప్రకాశరావు, కర్రి సోమిరెడ్డి, మాదేటి సత్యనారాయణ, సిహెచ్.నరసింగరావు, వెంకటలక్ష్మీ, శైలుకుమారి, కోటేశ్వరమ్మ, బేబీ, మహాలక్ష్మీ, ప్రసన్న, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేసిన చిన్నారులతో ఆలయ కమిటీ సభ్యులు



శ్రీరావి దుర్గా గణపతి సాయి షణ్ముఖ ప్రసన్నాంజనేయ ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో..
– న్యూస్‌టుడే, వన్‌టౌన్



మాధవధార, న్యూస్‌టుడే : మాధవధార సీతన్నగార్డెన్స్‌లో కొలువై ఉన్న కనకమహాలక్ష్మి, గాయత్రీదేవి, కనకదుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నాల్గవ రోజు అమ్మవారిని లలితా త్రిపురసుందరి దేవిగా ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

రాజరాజేశ్వరిగా దర్శనం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పాతనగరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు ఆదివారం రాజరాజేశ్వరి అవతారంలో దర్శనమిచ్చారు. ★ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా డాబాగార్డెన్స్ సమీపంలోని ఉమాదేవి ఆలయంలో అమ్మవారు ఆదివారం లలిత త్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



రాజరాజేశ్వరి అవతారంలో కన్యకాపరమేశ్వరి



త్రిపుర సుందరి దేవి అలంకరణలో ఉమాదేవి

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

అలరించిన సాంస్కృతిక నృత్యాలు

మురళీనగర్, న్యూస్‌టుడే : స్థానిక శ్రీ సీతారామాలయంలో లలితాదేవిని శరన్నవరాత్రి ఉత్సవాల నాల్గవ రోజు ఆదివారం శ్రీ మహాలక్ష్మి అవతారంలో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శ్రీ నాట్య రసజ్ఞ స్కూల్ ఆఫ్ ప్లాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో హర్షలత బృందం అభినయించిన నృత్యాలు ఆహుతులను అలరించాయి.



సాంస్కృతిక ప్రదర్శనలో చిన్నారులు



మహాలక్ష్మి అవతారంలో లలితాదేవి

శ్రీదుర్గమాంబ అమ్మవారి ఆలయంలో..

కంచరపాలెం, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రుల్లో భాగంగా ఆదివారం శ్రీదుర్గమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. రెడ్డికంచరపాలెం సన్‌రైజ్‌క్లబ్ వద్ద గల అమ్మవారి దేవాలయంలో శ్రీదుర్గమాంబ అమ్మవారు నాల్గో రోజు శ్రీలలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఊర్వశికూడలి సమీపంలో గల దేవాలయం వద్ద శ్రీదుర్గమాంబ, శ్రీకుంచుమాంబ అమ్మవార్లకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.



సన్‌రైజ్ క్లబ్ వద్ద..



ఊర్వశికూడలి సమీపంలో శ్రీదుర్గమాంబ, శ్రీకుంచుమాంబ అమ్మవారి దేవాలయంలో మహిళల కుంకుమ పూజలు

ఓవరాల్ ఛాంపియన్ విశాఖ

శ్యామలా సెంటర్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను విశాఖపట్నం కైవసం చేసుకుంది. వరుసగా బాలురు, బాలికల ఛాంపియన్‌షిప్‌ను కూడా కైవసం చేసుకొని అన్నింటా విజయకేతనం ఎగురవేసింది. వ్యక్తిగత బాలుర విభాగంలో దుడ్డు శేష (విశాఖ), ఎస్కే రోషన్ (గుంటూరు) కైవసం చేసుకోగా.. బాలికల విభాగంలో ఎల్.డింపుల్‌మహశ్రీ (ఏలూరు), బాకి శైలజ (విశాఖ), పి.వసంత (విజయనగరం) కైవసం చేసుకున్నారు.



ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన విశాఖజట్టు క్రీడాకారులు

వాకర్స్ క్యాబినెట్ కౌన్సిల్ సమావేశం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా 101 గవర్నర్ కె.రంగారావు అధ్యక్షతన ఆదివారం క్యాబినెట్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఎంవీపీకాలనీ ఐ.ఐ.ఎ.ఎం. కళాశాలలో జరిగిన సమావేశంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఉద్యమంలో స్ఫూర్తివంతమైన కీలక పాత్ర పోషిస్తున్న సంఘ సేవకులు వాకర్స్ ఇంటర్నేషనల్ పీఆర్‌ఓ కమల్ బెయిద్ సేవలను కొనియాడుతూ సంస్థ ప్రతినిధులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆర్.సత్యానందం, నండూరి రామకృష్ణ, ఉప్పలపాటి శుభ, ద్వారకానాథ్, నరసింహారావు, అప్పారావు, వెంటకరాజు, నాగార్జున, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు. వాకర్స్ క్లబ్ ప్రతినిధులకు పర్యావరణహితార్థం నార సంచులు కమల్ బెయిద్ అందించారు.



కమల్ బెయిద్‌ను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

కృత్రిమ గర్భధారణపై సదస్సు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: కృత్రిమ గర్భధారణలో నూతన పద్ధతులు, పిల్లలు కలగడంలో ఆలస్యమైన దంపతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్ జతిన్‌షా వివరించారు. సిరిపురం ఓ హోటల్లో ఆదివారం ఉదయం ప్రసూతి వైద్యనిపుణుల సొసైటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ జతిన్‌షా (ముంబయి) సంతాన లేమి దంపతులకు కొత్త కొత్త విధానాలపై అవగాహన కల్పించారు. సంతాన లేమి దంపతుల కోసం నూతన విధానాలు ఏ విధంగా ఉపయోగించాలనే విషయంపై వివరించారు. డాక్టర్ రవిరాజు జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభించారు. వైద్యులు శశిప్రభ, సుబ్బరాజు, మురళీకృష్ణ, పద్మావతి, వివిధ ప్రాంతాల నుంచి సుమారు మూడు వందల మంది వైద్యులు పాల్గొన్నారు.

గాజువాక
•గాజువాక •విశాఖ పశ్చిమం

ఓవరాల్ ఛాంపియన్ విశాఖ

రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను విశాఖపట్నం కైవసం చేసుకుంది. వరుసగా బాలురు, బాలికల ఛాంపియన్‌షిప్‌ను కూడా కైవసం చేసుకొని అన్నింటా విజయకేతనం ఎగురవేసింది. వ్యక్తిగత బాలుర విభాగంలో దుడ్డు శేష (విశాఖ), ఎస్‌కే రోషన్ (గుంటూరు) కైవసం చేసుకోగా.. బాలికల విభాగంలో ఎల్. డింపుల్‌మహశ్రీ (ఏలూరు), బాకి శైలజ (విశాఖ), పి.వసంత (విజయనగరం) కైవసం చేసుకున్నారు.


విజేతలుగా నిలిచిన విశాఖ జట్టు క్రీడాకారులు

బాలల నృత్యోత్సవం



గాజువాక, న్యూస్‌టుడే: తిరుమల వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం గాజువాక కళాదర్శిని మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ చిన్నారులు ప్రదర్శించిన నృత్యం అలరించింది. ఆకట్టుకుంది. నాట్యాచార్యుడు సందీప్‌కుమార్ తెలిపారు. ప్రతిభ చూపిన కళాకారులకు నిర్వాహకులు చేతుల మీదుగా జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

సమస్య: గాజువాక మహిళా రైతుబజారు వద్ద డ్రైనేజీ అధ్వానంగా ఉంది. పూడిక పేరుకుపోయి, మురుగు నిల్వ ఉండడంతో దుర్వాసన భరించలేకపోతున్నాం.

–చుండూరి సత్య, పాతగాజువాక

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి ప్రత్యేక శుభ్రత పనులు చేయిస్తాం.

–డాక్టర్ కిరణ్‌కుమార్, ఏఎంఓహెచ్

స్పందనకు వందనం

దోమల నివారణ చర్యలు: జీవీఎంసీ 75వ వార్డు ఉక్కు నిర్వాసిత కాలనీల్లో దోమల నివారణకు పారిశుద్ధ్య సిబ్బంది చర్యలు చేపట్టారు. అక్కడి సమస్యపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. తమ సిబ్బందితో నెల్లిముక్కు, సీతానగరం పరిసర కాలనీల్లో ఫాగింగ్ ఆపరేషన్ చేపట్టారు.

–న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

కార్పొరేటర్‌కు సత్కారం

మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 63వ వార్డు జైఆంధ్రకాలనీ ఇమ్మానుయేల్ ప్రేయర్ ఫెలోషిప్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం కార్పొరేటర్ గల్లా చిన్నాను సత్కరించారు. చర్చి ఫాదర్ లాజరస్, తెదేపా నాయకులు బాబూరావు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.


కూర్మన్నపాలెంలో నరసింగరావును అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు


ఉక్కు శిబిరం వద్ద మాట్లాడుతున్న సీపీఎం, సీపీఐ, పోరాట కమిటీ నాయకులు


అగనంపూడి కూడలిలో...


పాతగాజువాక కూడలిలో...

ఉక్కు సంకల్పంతో ఉద్యమిస్తాం..!

'మానవహారం'లో నినదించిన కార్మికులు


కూర్మన్నపాలెంలో నినాదాలు చేస్తున్న కార్మికులు

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు–3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారంపై కేంద్ర ప్రభుత్వం ఆటవిక న్యాయం ప్రదర్శిస్తుందని సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ ఆరోపించారు. ఉక్కు పరిరక్షణ కోరుతూ ఆదివారం అగనంపూడి నుంచి గాజువాక వరకు ఉక్కు కార్మికులు చేపట్టిన మానవహారంలో వారు మాట్లాడారు. 1333 రోజుల నుంచి కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా... కేంద్రం స్పందించకపోవడం దారుణమన్నారు. దిల్లీ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశాఖ ఉక్కు సమస్యలపై ప్రధాని మోదీతో చర్చించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఉక్కు కర్మాగారంపై కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే.... ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రజా సంపదను దొడ్డిదారిలో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాల్సిన బాధ్యత రాష్ట్రంలోని అన్ని పార్టీలపై ఉందన్నారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు కొనసాగిన నిరసనలో సిటూ రాష్ట్ర నాయకుడు సీహెచ్.నరసింగరావు, 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు, కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, పి.వి.రమణమూర్తి, బి.పైడిరాజు, వి.రామ్మోహన్‌కుమార్, డి.సురేష్ బాబు, జె.రామకృష్ణ, వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

★ కూర్మన్నపాలెంలో కార్మిక నాయకులు రాస్తారోకో నిర్వహించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. సిటూ రాష్ట్ర నాయకుడు సీహెచ్.నరసింగరావుతో పాటు మరికొందరిని అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. నిరసనలో పాల్గొన్న ఉక్కు ఉద్యోగి దీపాయ్ ప్రత్యేక వేషధారణతో కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అగనంపూడి, న్యూస్‌టుడే : ఉక్కు సంకల్పంతో పోరాటం సాగిస్తామని నిర్వాసితులు, కార్మికులు ప్రతిజ్ఞ చేశారు. అగనంపూడి ప్రాంతంలో చేపట్టిన మానవహారంలో కార్మికులు, నిర్వాసితులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్లకార్డులు ప్రదర్శించి కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, కార్మిక నాయకులు బి.సత్యనారాయణ, ఎస్.గోవిందరావు, పి.హరినాథ్, ఎం.నర్సింగరావు, వి.రాము, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.


పెదగంట్యాడలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ...

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ఉక్కు పరిరక్షణ కోరుతూ గాజువాకలో నిర్వహించిన ధర్నా, మానవహారంలో మాజీ ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, గురుమూర్తిరెడ్డి పాల్గొని మాట్లాడారు. కేంద్రం స్పందించి ఉక్కు కార్మికులు, నిర్వాసితుల ఉపాధికి భరోసా ఇవ్వాలని డిమాండు చేశారు. నాయకులు ఎ.ఎ.సేన్‌రావు, పరదేశి, పిట్టారెడ్డి, ముత్యాలు, చినతల్లి, ప్రభాకర్‌రెడ్డి, గణపతిరెడ్డి పాల్గొన్నారు.

★ ఉక్కు నిర్వాసిత సంఘం, తెదేపా ఆధ్వర్యంలో పెదగంట్యాడ, నడుపూరులో నిరసన చేపట్టారు. తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, నాయకులు అప్పలరాజు, రమణబాబు, ఎంఎస్.రాజు, సన్యాసిరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సభ్యుల శ్రమదానం

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : కూర్మన్నపాలెం సమీప రామ్‌నగర్ రుద్ర పరిసరాల్లో ఆదివారం ఆర్కిడ్ వాకర్స్ క్లబ్ సభ్యులు శ్రమదానం చేశారు. ఎక్కడికక్కడ పెరిగిన పిచ్చిమొక్కలు, తుప్పల్ని తొలగించారు. క్లబ్ ప్రతినిధులు ఎస్.బాస్కరరావు, సూర్యభాస్కరరావు, ముత్యాలునాయుడు, సత్యనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నవదుర్గా... నమోస్తుతే...!

కొనసాగుతున్న దసరా ఉత్సవాలు


క్రాంతినగర్‌లో..


బాపూజీనగర్‌లో...


ఐఎన్ఎస్ ఏకశిల వద్ద..


తుమ్మడపాలెంలో..


ఎల్‌వీనగర్‌లో..


శ్రీనగర్‌లో..


డ్రైవర్స్‌కాలనీలో..


కైలాస్‌నగర్‌లో..


చినగంట్యాడలో..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గాజువాక, విశాఖ పశ్చిమం నియోజకవర్గాల్లోని ఆలయాలు, మండపాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించగా, భక్తులు దర్శించుకున్నారు. మహిళలు అమ్మవారి సారె ఊరేగింపులో పాల్గొని, కుంకుమార్చనలు చేశారు. భవానీ మాల ధరించిన భక్తులు, వివిధ పార్టీల నాయకులు అమ్మవార్లకు పూజలు చేశారు. కొన్నిచోట్ల అన్నసమారాధన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. –న్యూస్‌టుడే, గాజువాక, విశాఖ పశ్చిమం బృందం


నాతయ్యపాలెంలో..


ఎల్ఎన్ గార్డెన్స్‌లో..


62వ వార్డు దుర్గానగర్‌లో...


ఏదురువానిపాలెం ఊరేగింపులో ఎమ్మెల్యే గణబాబు


రాసాలమ్మకాలనీ అన్నసమారాధనలో కార్పొరేటర్ కోటేశ్వరరావు


షీలానగర్‌లో...

రక్తదాతలకు ప్రోత్సాహం

గాజువాక, న్యూస్‌టుడే : ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడేలా రక్తం అందిస్తున్న రక్తదాతలకు తగిన ప్రోత్సాహం అందిస్తామని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం టీడీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాజువాకలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. యువత సామాజిక బాధ్యతగా రక్తదానానికి ముందుకు రావాలన్నారు. అనంతరం రక్తం దానం చేసిన సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. జనసేన రాష్ట్ర డాక్టర్స్ సెల్ ఛైర్మన్ బొడ్డేపల్లి రఘు, ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్.దిల్లీరావు, రెయ్యి రత్న, గాంధీ పాల్గొన్నారు.


రక్తదాతలను అభినందిస్తున్న పల్లా శ్రీనివాసరావు

క్రీడల్లో రాణిస్తే గుర్తింపు

గాజువాక, న్యూస్‌టుడే: క్రీడల్లో రాణించే క్రీడాకారులకు సమాజంలో మంచి గుర్తింపు దక్కుతుందని, క్రీడలతో వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అన్నారు. ఆదివారం నడుపూరు హైస్కూల్ మైదానంలో జవాన్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా అవగాహన శిబిరం, మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలను ఆమె ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది అండిబోయిన లక్ష్మి, నిర్వాహకులు రంగబాబు, పి.శ్రీనివాస్, కోచ్‌లు వెంకటేశ్, సతీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పోటీలు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లక్ష్మీబాయి

అభివృద్ధి పనులకు శ్రీకారం

ఈనాడు కథనాలకు స్పందన

గోపాలపట్నం(కొత్తపాలెం), న్యూస్‌టుడే : జీవీఎంసీ 89వ వార్డు మహాత్మా ఆదర్శనగర్ రైల్వేగేటు నుంచి కొత్తపాలెం కూడలి వరకు ఉన్న రహదారి గోతులతో అధ్వానంగా తయారైంది. రాకపోకలు సాగించేందుకు ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై గతంలో పలుమార్లు 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన అధికారులు రహదారి పునరుద్ధరణకు నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో చేపట్టే పనులకు ఆదివారం వార్డు కార్పొరేటర్ వెంకటరమేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వార్డు పరిధిలో సుమారు రూ.1.85 కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. వార్డు తెదేపా అధ్యక్షుడు బి.విజయ్‌కుమార్, నాయకులు ప్రదీప్, సురేశ్, ప్రజా పనుల విభాగం ఏఈ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వెంకటరమేశ్

గీత కార్మికులకు రాయితీ పెంచాలి

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు లిక్కర్ పాలసీలో ప్రకటించిన 10 శాతం దుకాణాలను 20 శాతానికి పెంచాలని పారిశ్రామిక ప్రాంత గీత సహకులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెల్లుబోయిన నాయుడు కోరారు. ఆదివారం పెదగంట్యాడలో గీత కార్మికులు, సొసైటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. లైసెన్స్ ఫీజులో గీతకార్మికులకు 50 శాతానికి మించి రాయితీ ఇవ్వాలన్నారు. సొసైటీ అధ్యక్షుడు పి.సన్యాసిరావు, సభ్యులు సాధూరావు, సన్యాసిరావు, రమణ, రామునాయుడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చెల్లుబోయిన నాయుడు

సామాజిక సేవలకు ప్రాధాన్యం

సింధియా(నెహ్రూనగర్), న్యూస్‌టుడే: సమాజంలో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ప్రజా సేవకు ప్రాధాన్యం ఇవ్వాలని పశ్చిమం ఎమ్మెల్యే తనయుడు మౌర్య సింహ అన్నారు. ఆదివారం హిమాచల్‌నగర్‌లో మానవత్వ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ ద్వారా చేస్తున్న సేవల్ని పారిశ్రామిక ప్రాంతంలోనూ విస్తరించాలని సూచించారు. అనంతరం నూతన కమిటీ సభ్యుల్ని ఎన్నుకోగా, వారు బాధ్యతలు స్వీకరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న మౌర్యసింహ

ఆత్మరక్షణ విద్యకు ఆదరణ


విజేతలకు సర్టిఫికేట్లు అందించిన దృశ్యం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే ఆత్మరక్షణ విద్యపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం దయాల్‌నగర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులకు పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి ధ్రువీకరణ పత్రాలు, కరాటే బెల్టులు అందజేశారు. కోచ్ జీఎస్.మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రాఘవరెడ్డి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వ్యవస్థాపకుడు ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. నిర్వాహకులు డి.రవికుమార్, తనూజ, హరిపవన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విన్నపం

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు–3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కార్మికుల్ని అన్ని విధాలుగా భయభ్రాంతులకు గురి చేస్తున్న ఉక్కు యాజమాన్యంతో చర్చించి, వివిధ సమస్యలు పరిష్కరించాలని ఉక్కు పోరాట కమిటీ నాయకులు కోరారు. ఆదివారం వారు తెదేపా రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి వినతులు అందించారు. ఇంటి అద్దె చెల్లించాలని, విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని కోరుతూ.. ఈడీ(వర్క్స్) కార్యాలయం వద్ద సుమారు 24 గంటల పాటు నిరసన తెలియజేసినా, ఓ మహిళా ఉద్యోగి అస్వస్థతకు గురైనా అధికారులు స్పందించలేదని వివరించారు. సకాలంలో వేతనాలు అందక యువ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యలపై ఎంపీ శ్రీభరత్‌తో కలిసి ఉక్కు సీఎండీ ఎ.కె.సక్సేనాతో చర్చించేందుకు చొరవ చూపాలని పల్లాను కోరారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, పి.వి.రమణమూర్తి, జి.నరేంద్రకుమార్, ఎన్.సింహాద్రి, డి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లాకు సమస్య వివరిస్తున్న ఉక్కు నాయకులు